నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 22-1-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 151 | పేజీలు: 4 | వెల: రూ.1/-

ఉగ్రవాదులతో పోరులో ఇద్దరు జవాన్లు బలి

ఇద్దరు ఉగ్రవాదుల హతం..

శ్రీనగర్,జనవరి21(ఆర్ఎన్ఎ): జమ్మూ కాశ్మీర్‌లోని అవంతిపురా రీజియన్‌లో మంగళవారం ఉదయం భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎదురుకాల్పుల్లో ఇద్దరు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. ఇద్దరు ఉగ్రవాదులను బలగాలు మట్టుబెట్టాయి. ఉగ్రవాదులు ఏ సంస్థకు చెందినవారో తెలియాల్సి ఉంది. అవంతిపురాలోని సత్‌పోక్రాన్ క్రేవ్ ఏరియాలో ఉగ్రవాదులు సంచరిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో సీఆర్పీఎఫ్, రాష్ట్రీయ రైఫిల్స్, జమ్మూ కాశ్మీర్ పోలీసులు కలిసి సంయుక్తంగా కూంబింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో ఉగ్రవాదులు బలగాలకు తారసపడ్డారు.

నేడే పురపాలక ఎన్నికలు

భారీగా ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం

ఓటర్లు స్వేఛగా ఓటేసేలా చర్యలు

హైదరాబాద్,జనవరి21(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో మొదటి పురపాలక ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. 9 నగరపాలక, 120 పురపాలక సంఘాల్లో బుధవారం పోలింగ్ జరగనుంది. మొత్తం 50 లక్షల మందికి పైగా ప్రజలు ఓటింగ్‌లో పాల్గొననున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని డబీర్‌పురా డివిజన్‌కు ఉపఎన్నిక జరుగుతోంది. మొత్తం కార్పొరేషన్లలో 325 డివిజన్లకుగాను ఒక వార్డు ఏకగ్రీవం కాగా పురపాలికల్లోని 2,727 వార్డుల్లో 80 ఏకగ్రీవమయ్యాయి. 45 వేల మంది సిబ్బంది పోలింగ్ విధుల్లో పాల్గొననున్నారు. ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటున్నారు. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో అధికారులు బుధవారం సెలవు ప్రకటించారు. కార్పొరేషన్, మునిసిపల్ ఎన్నికల దృష్ట్యా సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి మద్యం దుకాణాలు మూసివేసారు. మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాలను ఈనెల 22న సాయంత్రం 5 గంటల వరకు మూసివేయనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు కూడా ఓటు వేసేందుకు ముందుకు రావాలని, వారికి కంపెనీలు 3 గంటల పాటు సమయమివ్వాలని ఆయా కంపెనీలను ఆదేశించింది. ఓటు గోప్యతకు భంగం కలిగిస్తే 3 నెలల జైలు శిక్ష, జరిమానా విధిస్తామని ఎన్నికల సంఘం హెచ్చరికలు జారీ చేసింది. ఈ నెల 22న 9 నగరపాలక సంస్థలు, 120 మున్సిపాలిటీల్లో పోలింగ్ జరగనుంది. 9 కార్పోరేషన్లలోని 325 వార్డుల్లో 1,438 పోలింగ్ కేంద్రాలు, 120 మున్సిపాలిటీల్లోని 2, 727 వార్డుల్లో 6, 325 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎస్ఈసీ పేర్కొన్నది. కాగా, కరీంనగర్ మున్సిపాలిటీలో మాత్రం ఈ నెల 22న ప్రచారం ముగియనుంది. సోషల్ మీడియాలో ప్రచారం చేసినా కఠిన చర్యలు ఉంటాయని చెప్పింది. క్యాండిడేట్లు, రాజకీయ పార్టీలు, ప్రచార నిర్వాహకులు, మీడియా ఇన్ చార్జ్‌లు దీన్ని గమనించి, కచ్చితంగా పాటించాలని ఆదేశించింది. మొత్తంగా గతంలో ఎన్నడూ లేనతగా పట్టణ ప్రాంతాల్లో ప్రచారం సాగింది. కొత్తగా ఏర్పడ్డ మున్సిపాలిటీల్లో కూడా ప్రచారం జోరందుకుంది. ఈ ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ప్రచారంలో వేడి అందుకుంది.

ఢిల్లీలో ఎన్నికల హీట్

కేజీవ్రాల్, మనోజ్ తివారీ ట్విటర్ వార్

న్యూఢిల్లీ,జనవరి 21(ఆర్ఎన్ఎ): దేశ రాజధానిలో అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ ప్రధాన పార్టీలు ప్రచార వేగం పెంచాయి. గెలుపు కోసం వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తున్నాయి. తమ వాగ్దాటితో ప్రత్యర్థి పార్టీపై విమర్శల వర్షం కురిపిస్తున్నాయి. తాజాగా దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్, భాజపా ఎంపీ మనోజ్ తివారీ ట్విటర్ వేదికగా మాటల యుద్ధానికి దిగారు. ఆ వైపునుంటారా లేదా అభివృద్ధి జరిపించే మావైపున ఉంటారా అని పరస్పరం విమర్శించుకుంటూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.

ప్రతిపక్ష పార్టీలను విమర్శిస్తూ మంగళవారం ఉదయం అరవింద్ కేజీవ్రాల్ ఓ ట్వీట్ చేశారు. 'ఓ వైపు – భాజపా, జేడీయూ, ఎల్‌జేపీ, జేజేపీ, కాంగ్రెస్, ఆర్జేడీ.. మరోవైపు – స్కూల్, హాస్పిటల్, నీరు, విద్యుత్, మహిళలకు ఉచిత రవాణా, దిల్లీ ప్రజలు.. నా లక్ష్యం – అవినీతిని ఓడించడం, దిల్లీని ముందుకు తీసుకెళ్లడం.. వారందరి ఏకైక లక్ష్యం – నన్ను ఓడించడం' అని సీఎం విమర్శలు చేశారు.

కేజీవ్రాల్ ట్వీట్ చేసిన కేవలం 30 నిమిషాల్లోపే భాజపా దిల్లీ అధ్యక్షుడు మనోజ్ తివారీ సీఎంకు కౌంటర్ ఇస్తూ ట్వీట్ చేశారు. 'ఓ వైపు – దెబ్బతిన్న రోడ్లు, కలుషితమైన, విషపూరితమైన నీరు, ఒక్క కొత్త స్కూల్, కొత్త ఆసుపత్రి లేదు. హాస్పిటళ్లలో ఆపరేషన్ థియేటర్లు మూతబడ్డాయి. ఒక్క విద్యుత్ బస్సు కూడా లేదు. అవినీతిపై పోరాడుతున్న నేతలను పార్టీ నుంచి తొలగించింది. మహాకూటమితో కాంగ్రెస్‌తో చేతులు కలిపింది. మొత్తానికి 70 నియోజకవర్గాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ విఫలమైంది. మరోవైపు – భాజపా అందరితో కలిసి అందరి అభివృద్ధి కోసం పనిచేస్తోంది' అని తివారీ ఆప్ సర్కార్‌ను దుయ్యబట్టారు. దిల్లీ ప్రజలు భాజపాతోనే ఉంటారని ఈ సందర్భంగా ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఇలా పరస్పర విమర్శలతో 'ఆ పార్టీకి ఓటేస్తారో.. లేదా మా పార్టీకి ఓటేస్తారో మీరే తేల్చుకోండి' అంటూ పరోక్షంగా దిల్లీ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేశారు.

ఆప్ ఎమ్మెల్యేకు టికెట్ నిరాకరణ..రాజీనామా

ఆమ్ ఆద్మీ పార్టీకి ఎమ్మెల్యే సురేందర్ సింగ్ గుడ్‌బై చెప్పారు. ఫిబ్రవరి నెలలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆప్ తరపున ఎమ్మెల్యే సురేందర్‌సింగ్‌కు పార్టీ టికెట్ కేటాయించలేదు. దీంతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సురేందర్ సింగ్ ప్రకటించారు. ఇవాళ నాకు బాధాకరమైన రోజు. ఆప్ కు నా రాజీనామా లేఖను సమర్పిస్తున్నాని ఎమ్మెల్యే సురేందర్ సింగ్ ట్వీట్ చేశారు. ఢిల్లీలో 70 అసెంబ్లీ స్థానాలకు ఆప్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఆప్ ఈ సారి 23 మంది కొత్తవారికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించింది.

కేరళ పర్యటనలో తెలంగాణ ఉన్నతాధికారుల బృందం

సమగ్ర ఎన్నారై విధానంపై అధ్యయనం

హైదరాబాద్,జనవరి 21(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర ఎన్నారై విధానాన్ని రూపొందించే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు ఇందుకు సంబంధించి వివిధ రాష్ట్రాల విధానాలను తెలంగాణ రాష్ట్ర ఉన్నతాధికారుల బఅందం అధ్యయనం చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర ఉన్నతాధికారుల బృందం కేరళ రాష్ట్రంలో పర్యటిస్తోంది. విదేశాలకు వెళ్లే కేరళ ప్రజలకు ఆ రాష్ట్రం అమలు చేస్తున్న విధానంపై ఈ బృందం అధ్యయనం చేస్తోంది. తెలంగాణ ఉన్నతాధికారుల బృందంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, సిఎం ముఖ్యకార్యదర్శి నర్సింగరావులు ఉన్నారు. తిరువనంతపురంలో ప్రవాస కేరళీయుల సంక్షేమ వ్యవహారాల శాఖ అధికారులతో వారు సమావేశమయ్యారు.

రాచకొండ కమిషనరేట్ పరిధిలో పటిష్ట బందోబస్తు

హైదరాబాద్, జనవరి 21: మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని సీపీ మహేశ్ భగవత్ స్పష్టం చేశారు. రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో 5 కార్పొరేషన్లు, 17 మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరగనున్నాయని సీపీ పేర్కొన్నారు. 22 మున్సిపాలిటీల్లోని 470 వార్డుల్లో ఏడు ఏకగ్రీవం అయ్యాయని తెలిపారు. 3 జోన్ల పరిధిలోని 19 పోలీసు స్టేషన్ల పరిధిలో ఎన్నికలు జరుగుతున్నాయి. సివిల్, ఏఆర్, హోంగార్డ్స్ ప్రత్యేక పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కోసం 4,107 మంది సిబ్బందితో భద్రత కల్పిస్తున్నాం. 598 లైసెన్స్ కలిగిన ఆయుధాలు సరెండర్ చేశారని పేర్కొన్నారు. 216 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేశామన్నారు. ఇప్పటి వరకు రూ. 80 వేలు, 843 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. 428 పోలింగ్ లోకేషన్లలో 92 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాం. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని సీపీ మహేశ్ భగవత్ స్పష్టం చేశారు. ఈ నెల 22న ఎన్నికలు జరగనున్నాయి. 25న ఫలితాలు వెల్లడి కానున్నాయి.

చరిత్రలో నేటినిజం

కం॥ కొలుదు- తెలంగాణములో
తెలుగును నిలబెట్టగారి తోడేవ యోడనే
బలవంతులతో బోరుచు
నలరించిన" మాడపాటి హనుమంతరావునే!!

(జనవరి 22 మాడపాటి హనుమంతరావు జననం..)

-రాధశ్రీ
సెల్: 9494481210

ఆమ్ ఆద్మీ పార్టీని వీడిన ఎమ్మెల్యే సురేందర్ సింగ్

న్యూఢిల్లీ, జనవరి 21: ఆమ్ ఆద్మీ పార్టీకి ఎమ్మెల్యే సురేందర్ సింగ్ గుడ్‌బై చెప్పారు. ఫిబ్రవరి నెలలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆప్ తరపున ఎమ్మెల్యే సురేందర్‌సింగ్‌కు పార్టీ టికెట్ కేటాయించలేదు. దీంతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సురేందర్ సింగ్ ప్రకటించారు. ఇవాళ నాకు బాధాకరమైన రోజు. ఆప్ కు నా రాజీనామా లేఖను సమర్పిస్తున్నాని ఎమ్మెల్యే సురేందర్ సింగ్ ట్వీట్ చేశారు. ఢిల్లీలో 70 అసెంబ్లీ స్థానాలకు ఆప్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఆప్ ఈ సారి 23 మంది కొత్తవారికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించింది.

బేగంపేట పబ్లిక్ స్కూలు వద్ద ఉద్రిక్తత

సీట్లు అమ్ముకున్నారంటూ తల్లిదండ్రుల ఆందోళన

హైదరాబాద్,జనవరి21(ఆర్ఎన్ఎ): నగరంలోని బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో తల్లిదండ్రులు మంగళవారం ఉదయం ధర్నాకు దిగారు. నేటి నుంచి అడ్మిషన్లు ఓపెన్ అని చెప్పి... అసలు సీట్లు లేవని పాఠశాల యాజమాన్యం చెబుతోందని ప్రిన్సిపాల్ ఛాంబర్ బయట వందల మంది తల్లిదండ్రులు ధర్నాకు దిగారు. సీట్లు అమ్మేసుకున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు. అడ్మిషన్లు ఓపెన్ చేశాక అప్పుడే ఎలా ముగుస్తాయని నిలదీశారు. సీట్లను ఎవరెవరికి ఎప్పుడెప్పుడు ఇచ్చారో చెప్పాలన్నారు. లేకుంటే ఊరుకునేది లేదన్నారు. సీట్లను అమ్ముకుని నాటకాలాడుతున్నారని పలువురు ఆందోళన చెందారు. ఈ బాగోతంపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ: ఒకరి హత్య

హైదరాబాద్,జనవరి21(ఆర్ఎన్ఎ): నగరంలోని కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధి ఖైత్లాపూర్‌లో దారుణ సంఘటన చోటుచేసుకుంది. స్నేహితుల మధ్య వాగ్వాదం ఒకరి హత్యకు దారితీసింది. అర్ధరాత్రి స్నేహితులంతా కలిసి మద్యం సేవించారు. ఆ సమయంలో వారిమధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో కొందరు యువకులు సుధీర్ అనే యువకుడిని బాటిల్‌తో పొడిచి చంపారు. హత్యకు పాల్పడిన హంతకుల వివరాలు తెలియాల్సి ఉంది. వివరాలు తెలుసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సామజవరగమనా సాంగ్‌కు ఫిదా

అనుభూతికి లోనయ్యానన్న మంత్రి కేటీఆర్

హైదరాబాద్,జనవరి21(ఆర్ఎన్ఎ): అల్లు అర్జున్, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందిన అల వైకుంఠపురములో సినిమా కోసం థమన్ స్వరపరచిన సామజవరగమనా సాంగ్ ఎంత సెన్సేషన్ క్రియేట్ చేసిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పాకిస్తాన్‌లోను ఈ సాంగ్‌పై చర్చ జరిగింది. పాకిస్తాన్‌కి చెందిన ముగ్గురు వ్యక్తులు ఈ సాంగ్‌పై డిబెట్ నిర్వహించారు. భాష అర్థం కాకపోయిన మ్యూజిక్ మాత్రం వినసొంపుగా ఉందంటూ వారు ప్రశంసలు కురిపించారు. తాజాగా ఈ సాంగ్ తనకి మరచిపోలేని అనుభూతిని మిగిల్చిందని తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన ట్విట్టర్ ద్వారా తెలిపారు. స్విట్జర్లాండ్‌లో ఉన్న కేటీఆర్ తనకి ఈ సాంగ్ మంచి కంపెనీ ఇచ్చిందంటూ ట్వీట్ చేశారు. చాలా అందమైన సాంగ్‌ని స్వరపరచావు అని థమన్‌పై ప్రశంసలు కురిపించారు కేటీఆర్. ఈ సాంగ్ నా మనస్సుకి ఎంతో హత్తుకుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అయితే కేటీఆర్ ట్వీట్‌కి వెంటనే స్పందించిన థమన్ మీ కామెంట్‌తో మా సాంగ్ మరింత సెన్సేషన్‌తో పాటు పవర్‌ఫుల్‌గా మారనుంది అని అన్నారు. మా సాంగ్ మీకు ఎంతో అనుభూతిని ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని థమన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. సామజవరగమనా సాంగ్‌కి సిరివెన్నెల సీతారామశాస్త్రి లిరిక్స్ అందించగా, సిద్ శ్రీరామ్ ఆలపించారు.

2కోట్ల విలువైన గంజాయి పట్టివేత

హైదరాబాద్,జనవరి 21(ఆర్ఎన్ఎ): సుమారు 2 కోట్ల రూపాయల విలువైన గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకెళ్తే.. పెద్ద అంబర్‌పేట వద్ద వరిపొట్టు లోడుతో వస్తున్న లారీనీ.. విశ్వనీయ సమాచారం మేరకు డీఆర్ఐ(డైరెక్టర్ ఆఫ్ ఇంటలిజెన్స్) అధికారులు తనిఖీ చేశారు. తీరా లారీలో చూస్తే, పైభాగంలో వరి పొట్టు, లోపల మొత్తం గంజాయితో నిండి ఉంది. దీంతో అధికారులు నివ్వెరపోయారు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. అక్రమంగా గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి, రూ. 2 కోట్లు విలువ చేసే 1,355 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందుతులను కస్టడీలోకి తీసుకొని విచారిస్తున్నారు.

'ఫేషియల్ రకగ్నేషన్'తో దుష్ప్రయోజనాలు

– అల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్

బ్రస్సెల్స్,జనవరి 21(ఆర్ఎన్ఎ): ఫేషియల్ రికగ్నిషన్ సాంకేతికతను తాత్కాలికంగా నిషేధించాలన్న ఐరోపా సమాఖ్య ప్రతిపాదనను అల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ స్వాగతించారు. ఈ సాంకేతిక వల్ల దుష్ప్రయోజనాలు కలిగే అవకాశం ఉందని పిచాయ్ అభిప్రాయపడ్డారు. సమస్యల్ని పరిష్కరించే దిశగా ప్రభుత్వాలు కట్టుదిట్టమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. బ్రస్సెల్స్‌లో జరిగిన ఓ ఉన్నతస్థాయి సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కృత్రిమ మేధ వంటి అత్యాధునిక సాంకేతికతపై మార్గదర్శకాలు రూపొందించే క్రమంలో.. వాటిని ఉపయోగించే రంగాలను బట్టి నిబంధనలు ఉండాలని ఆయన సూచించారు. వీడియో, ఆడియోలను మార్చడంలో కృత్రిమ మేధను ఉపయోగిస్తున్నారని.. దీన్ని అడ్డుకునేలా పరిశోధకులకు గూగుల్ సహకరిస్తోందని తెలిపారు.

మరోవైపు పిచాయ్ అభిప్రాయంతో మైక్రోసాఫ్ట్ అధ్యక్షుడు బ్రాడ్ స్మిత్ విభేదించారు. ఈ సాంకేతిక వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని తెలిపారు. తప్పిపోయిన చిన్నారులను కనుగొనడంలో స్వచ్ఛంద సంస్థలకు ఈ సాంకేతికత ఎంతగానో ఉపయోగపడుతుందని ఉదహరించారు. ఇలాంటి సమస్యలకు పరిష్కారం చూపగలిగే మరో ప్రత్యామ్నాయం ఏదైనా ఉంటేనే దీన్ని నిషేధించాలని సూచించారు. అత్యాధునిక సాంకేతికతలను వినియోగిస్తేనే వాటిని మరింత మెరుగుపరచగలమని ఆయన అభిప్రాయపడ్డారు.

అపోలో టైర్స్ వైస్ చైర్మన్‌తో మంత్రి కేటీఆర్ భేటీ

దావోస్, జనవరి 21: వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ నిన్న స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు చేరుకున్న విషయం విదితమే. దావోస్ పర్యటనలో భాగంగా అపోలో టైర్స్ వైస్ చైర్మన్, ఎండీ నీరజ్ కుమార్‌తో మంత్రి కేటీఆర్ సమావేశమై తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. హెచ్‌పీఈ సీవోవో విశాల్ లాల్‌తో కూడా కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై మంత్రి కేటీఆర్ వారికి వివరించారు.సోమవారం ప్రారంభమైన 50వ ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాలు 24వ తేదీ వరకు జరుగనున్నాయి. ఇందులో టెక్నాలజీ ప్రయోజనాలు– ఎదురయ్యే సవాళ్లపై చర్చ జరుగనున్నది. నాలుగో పారిశ్రామిక విప్లవంలో సాంకేతిక ప్రయోజనాలు– సవాళ్లను నివారించడం అనే అంశంపై మంత్రి కేటీఆర్ ప్రసంగిస్తారు. సాంకేతికత వినియోగంలో తెలంగాణ ప్రభుత్వ ప్రగతిని వివరిస్తారు. సమావేశాల సందర్భంగా ప్రపంచదేశాలకు చెందిన అనేకమంది పారిశ్రామికవేత్తలతో కేటీఆర్ భేటీ కానున్నారు. రాష్ట్రంలో ఫార్మాసిటీ, టెక్స్‌టైల్ పార్క్, జీనోమ్ వ్యాలీ, మెడికల్ డివైజెస్ పార్క్, కృత్రిమ మేధ, ఎలక్ట్రానిక్ సహా పలురంగాల్లో పెట్టుబడులను ఆహ్వానించనున్నారు.

మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు

రంగారెడ్డి రీజియన్ నుంచి 500 సర్వీసులు

హైదరాబాద్,జనవరి21(ఆర్ఎన్ఎ): అతిపెద్ద గిరిజన సంబురాలు, మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు రంగారెడ్డి రీజియన్ ఆధ్వర్యంలో 500 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు ఆర్టీసీ ఆర్ఎం వరప్రసాద్ తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద మేడారం జాతరకు గతేడాది 375 బస్సులను నడిపించగా ఈసారి ప్రయాణికుల కోసం జాతర నిర్వహించే ఫిబ్రవరి 2 నుంచి 8 వరకు 500 ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్‌నగర్, ఉప్పల్ క్రాస్‌రోడ్, జగద్గిరిగుట్ట, కేపీహెచ్‌బీ, మియాపూర్, లింగంపల్లి, లాల్‌దర్వాజ మహాంకాళీ ఆలయం పాయింట్లనుంచి ప్రత్యేక బస్సులు ఉంటాయని, డిపో మేనేజర్‌స్థాయి అధికారులను ప్రత్యేక పాయింట్లలో, మేడారంలో ప్రయాణికుల సౌకర్యాలు చూస్తారని తెలిపారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవచ్చని అన్నారు. నగరంలో ఏ ప్రాంతంనుంచైనా ఒకేసారి 50 మంది మేడారం జాతరకు వెళ్తే.. వారివద్దకే బస్సును పంపుతామని, ఈ నెల 26న మేడారానికి అధికంగా భక్తు లు వెళ్తున్నందున నగరంలోని అన్ని పాయింట్ల నుంచి 40 ప్రత్యేక బస్సులను నడుస్తాయని చెప్పారు. మేడారం జాతరకు ఫిబ్రవరి 2న 30 బస్సులు, 3న 35, 4న 40, 5న 100, 6న 120, 7న 140, 8న 35 బస్సులను నడుపుతామని ఆర్ఎం వరప్రసాద్ తెలిపారు. లిలిలి.బిబసబిఞనీన్గి÷తిని.తిని వెబ్‌సైట్ నుంచి ఆన్‌లైన్ రిజర్వేషన్ చేసుకోవచ్చని చెప్పారు.

స్పీకర్ కూడా రాజకీయ పార్టీ వ్యక్తే కదా...

ఎంపీలు,ఎమ్మెల్యేల అనర్హత నిర్ణయాధికారంపై పునరాలోచించాలి

పార్లమెంట్‌ను అడిగిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ,జనవరి 21(ఆర్ఎన్ఎ): ఎంపీలు, ఎమ్మెల్యేల అనర్హత అంశంలో నిర్ణయాధికారం ఎవరికి ఉండాలి అన్నదానిపై పునరాలోచన చేయాలని సుప్రీంకోర్టు పార్లమెంట్‌ను అడిగింది. ప్రస్తుతం ఈ అధికారం స్పీకర్‌కు ఉన్నప్పటికీ ఆయన కూడా ఓ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తే కదా అని అభిప్రాయపడింది. అలా కాకుండా ప్రజాప్రతినిధుల అనర్హతపై నిర్ణయం తీసుకునేందుకు స్వతంత్ర, శాశ్వత యంత్రాంగం ఏర్పాటు చేసే విషయం గురించి పార్లమెంట్ ఆలోచించాలని సూచించింది. మణిపూర్ బీజేపీ మంత్రిపై అనర్హత వేయాలని కోరుతూ కాంగ్రెస్ నేతలు వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ అభిప్రాయాన్ని వెల్లడించింది. మణిపూర్ అటవీ శాఖ మంత్రి అయిన టీహెచ్ శ్యామ్‌కుమార్ కాంగ్రెస్ టికెట్‌పై ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం బీజేపీలో చేరి మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో శ్యామ్‌కుమార్‌పై అనర్హత వేయాలని కోరుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఫజూర్ రహీమ్, సీనియర్ నేత కె. మేఘచంద్ర సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ ఆర్ఎఫ్ నారిమన్ నేతృత్వంలోని ధర్మాసనం.. శ్యామ్‌కుమార్‌పై అనర్హత పిటిషన్‌పై నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని మణిపూర్ అసెంబ్లీ స్పీకర్‌ను ఆదేశించింది. గడువులోగా స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే అప్పుడు సుప్రీంకోర్టును ఆశ్రయించేలా కాంగ్రెస్ నేతలకు స్వేచ్ఛ కల్పించింది. ఈ సందర్భంగా స్పీకర్ విచక్షణాధికారాలపై పునరాలోచన చేయాలని సర్వోన్నత న్యాయస్థానం పార్లమెంట్‌కు సూచించింది. ప్రజాప్రతినిధులపై వచ్చిన అనర్హత పిటిషన్లపై పారదర్శక పక్రియ జరగాలంటే స్వతంత్ర యంత్రాంగం అవసరమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

వైసిపి ప్రభుత్వంది నిరంకుశం

–ఏపీ బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ

న్యూఢిల్లీ,జనవరి 21(ఆర్ఎన్ఎ) :వైసిపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఏపీ బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. 'వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఎవరు ప్రశాంతంగా ఉన్నారో సీఎం జగన్ చెప్పాలి. ప్రతి పిచ్చి పనికి కేంద్రం సహకారం ఉందని చేస్తున్న ప్రచారాన్ని ఖండిస్తున్నా. ఎన్నికలకు ముందు మూడు రాజధానులు చేస్తామని వైసిపి చెప్పలేదు. రాజధాని మార్చేందుకు వైకాపా చేస్తున్న ప్రచారాన్ని ప్రజలెవరూ నమ్మరు. ఖర్చు ఒక్కటే కారణమని నేను అనుకోవట్లేదు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ప్రజల తరపున జనసేనతో కలిసి పోరాటం చేస్తాం' అని కన్నా తెలిపారు.

ఎంపీ జీవీఎల్ నర్సింహారావు మాట్లాడుతూ.. 'అసెంబ్లీ ఒక్కటే ఉంటే రాజధాని అని ఎవరూ అనరు. మూడు రాజధానులు ఒక మిథ్య మాత్రమే. వైకాపా ప్రభుత్వం స్వార్థప్రయోజనాలకే ఎక్కువ ప్రాధన్యమిస్తోంది. కేంద్ర ప్రభుత్వం పెద్దన్న పాత్ర పోషించడానికి ఇది కుటుంబ వ్యవహారం కాదు. పెద్దన్న పాత్ర పోషించాలని కేంద్రంపై రుద్దే ప్రయత్నం మంచిది కాదు. కేంద్రం పెద్దన్న పాత్ర పోషిస్తే .. తెలుగుదేశం పార్టీ దద్దమ్మ పాత్ర పోషిస్తుందా? ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందంటున్నారు.. చర్యలు తీసుకోవట్లేదు. వైసిపి ప్రభుత్వం అక్రమార్కులను కాపాడే ప్రయత్నం చేస్తుందా? అక్రమాలు జరిగాయని స్పష్టంగా చెబుతూ.. విచారణకు ఎందుకు ఆదేశించట్లేదు? హైకోర్టును రాయలసీమలో పెట్టాలని గతంలోనే డిమాండ్ చేశాం. కానీ అప్పటి టిడిపి ప్రభుత్వం పట్టించుకోలేదు. జనసేనతో చర్చించి త్వరలో అమరావతిపై ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం' అని జీవీఎల్ తెలిపారు.

నేటినిజం
బుధవారం 22-1-2020

స్వయంకృతాపరాధం..

ప్రాచీన కాలంలో శాతవాహనులతో సంబంధం ఉన్నదీ, బౌద్ధంతో ముడివేసుకొన్నదీ అమరావతి. అక్కడి అమరారామం పంచారామాల్లో ఒకటి. వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు క్రీ.శ. 1790 ప్రాంతంలో తన జమిందారీ ఎస్టేట్‌కు ముఖ్యకేంద్రంగా పెట్టుకొన్నాడు. అంతేగాకుండా 2006 జనవరిలో ఇక్కడ కాలచక్ర మహాసమ్మేళనం కూడా జరిగింది. దేశవిదేశాలనుండి బౌద్ధ ప్రముఖులు ఇక్కడకు వచ్చారు. ఇక్కడ అమరావతి స్థూపం కూడా ప్రసిద్ధం. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని, చాలా వ్యూహాత్మకంగా చంద్రబాబు బౌద్ధ దేశాలనుండి పెట్టుబడులు ఆకర్షించాలని, ఇక్కడి దళితుల్లో బౌద్ధం పట్ల వున్న ప్రేమను రాజకీయంగా తనకు అనుకూలంగా మలచుకోవాలని బాబు ఈ ప్రాంతం ఎన్నుకోవడం ఓ సత్యం. వైయస్సార్ సీపీ ఆరోపించినట్లుగా తన వాళ్లతో భూములు కొనిపిచ్చి దానిచుట్టూ రాజధాని అనే వల అల్లాడని, అందుకే శివరామకృష్ణ కమిటీ నివేదిక త్రొక్కిపెట్టారని, అలాగే ఇక్కడ పెద్ద ఎత్తున అవినీతి ఆశ్రీత పక్షపాతం ఉందని మరో ఆరోపణ. భుజాన కండువా వేసుకొని 'తెలుగువారు – దక్షిణాదివారు' అనే జస్టిస్ పార్టీ మేధావి బ్యాచ్ చేసే హడావుడి ఇంకాస్త అనుమానాలకు తావు ఇచ్చింది. జగన్ అధికారంలోకి రాగానే చంద్రబాబు మానసికంగా దెబ్బకొట్టే పని నిర్విఘ్నంగా చేస్తున్నాడు. నిజానికి భౌగోళికంగా పొడవుగా వున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాల్సిన అవసరం వుంది. అనంతపూర్, కర్నూల్, శ్రీకాకుళం వంటి జిల్లాలు పాత మహబూబ్‌నగర్ జిల్లాల కన్నా ఘోరంగా ఉన్నాయి. అమరావతిలోని రైతులకు నష్టం జరిగితే వాళ్లకు ఏం చేయాలో సంయమనంతో ఆలోచించాల్సిన పార్టీలు, వారిని మరింత రెచ్చగొడుతున్నాయి. 29 గ్రామాలకు ప్రజల సమస్యను జగన్ కూడా అర్థం చేసుకోవాలి. అదే సమయంలో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల ప్రజలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. సరిగ్గా తెలంగాణ విషయంలో చంద్రబాబు ఇలాంటి ఎత్తుగడలే ప్రదర్శించి బోల్తాపడ్డాడు. అంతెందుకు! 2018 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇలాగే హద్దులు మీరిన విమర్శలు చంద్రశేఖరరావుపై చేసి టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చేందుకు పరోక్షంగా దోహదపడ్డాడు. ఆ తర్వాత మోదీ, షాలపై వ్యక్తిగతంగా కక్షగట్టి లేని శత్రుత్వం కొనితెచ్చుకున్నాడు. ఇపుడు రాజధాని విషయంలో చేస్తున్న 'అతి' చంద్రబాబుకే నష్టం కలిగిస్తుంది. ఇపుడు విశాఖపట్నం (ఉత్తరాంధ్ర) కర్నూలు (రాయలసీమ) ప్రజలు కొంత ఆనందంగా ఉన్నారు. మీరు అమరావతిలో రెచ్చిపోయినట్లు వాళ్లూ రెచ్చిపోతే తెలుగుదేశం పరిస్థితి ఏంటి? ఈ విషయంలో కేసీఆర్ సిలబస్‌నే జగన్ అనుసరిస్తున్నట్లు అనిపిస్తున్నది. ఈ ఆందోళనకు కారకుడుగా బాబును చూపించి, అమరావతిలోనే రాజధాని పెట్టి, మిగతా ప్రాంతాల ప్రజలను తెలుగుదేశానికి వ్యతిరేకంగా మలచడమే దీర్ఘకాలిక వ్యూహంగా ఉన్నట్లుంది. గతంలో తెలంగాణ ఉద్యమం విషయంలో బాబును రాజకీయంగా కేసీఆర్ ఇలాగే దెబ్బకొట్టారు. ఇవేవీ గమనించకుండా అత్యుత్సాహం ప్రదర్శిస్తే మరో నష్టం ఖాయం. ఇక ఈ గేమ్‌లోకి బీజేపీ ఎందుకు ఎంటరయ్యిందో వాళ్లకే తెలీదు. "ఎల్లమ్మ గుడి కాడ మొల్లాయన శిగం ఊగినట్లు" అనేది తెలంగాణలో ప్రసిద్ధ సామెత. ఎల్లమ్మ గుడిముందు వౌల్వీ పూనకం అనేది దీని అర్థం. కన్నా, సుజనా వంటివారి అనవసర జోక్యం పార్టీకి నష్టమేగానీ లాభం లేదు. అసలే అంతంతమాత్రంగా వున్న పార్టీకి చంద్రబాబు అధికారంలో లేని సమయంలో జవసత్వాలు నింపుకోకుండా ఇందులో దూరడం అవివేకం తప్ప ఇంకేం కాదు. కుల రాజకీయం కంపుగొట్టే ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రంలో సునీల్ దేవధర్ తప్పటుడుగులు వేస్తున్నట్లుగా ఉంది. విష్ణువర్ధన్ రెడ్డి, సోము వీర్రాజు, పైడికొండల మాణిక్యాలరావు వంటి కరడుగట్టిన భాజపా నాయకులను వదిలిపెట్టి కన్నాను ముందుపెట్టడం ఇపుడు ఇంకో తప్పే అవుతుంది. కన్నా తన ప్రాంతాభిమానంతో రాజధాని విషయంలో చేసే తప్పు రేపు పార్టీని దీర్ఘకాలంలో నష్టం కలిగిస్తుంది. చంద్రబాబు ప్రయోగించిన పవన్‌కళ్యాణ్‌తో కలిసి నడవడం భాజపాకు శరాఘాతం. అభివృద్ధి నిరోధకులు, ఆంధ్రా కులపక్షపాతులైన కమ్యూనిస్టులతో అంతర్గతంగా పవన్ కల్యాణ్‌కు సంబంధాలున్నాయి. భగత్‌సింగ్‌ను, అల్లూరి సీతారామరాజులను బొందపెట్టి చేగువేరాను తలపై మోసే పవన్‌కళ్యాణ్‌తో సిద్ధాంతపరంగా భాజపా ఎలా సాగుతుంది? తాట తీస్తా.. తోలు తీస్తా అనే మాటలు, మాట్లాడే పవన్‌కు అసలు రాజకీయం వచ్చా? ఇక కమ్యూనిస్టులు ఎక్కడుంటే అక్కడ అన్యాయమే అని గుర్తుంచుకోవాలి. వారు ధర్నాలు చేస్తున్నారంటే అందులో తప్పక 'అధర్మం' వుందని గుడ్డిగా చెప్పేయవచ్చు. ఇంత అన్యాయాలకు, స్వార్థాలకు కారణమైన వ్యవస్థకు మద్దతిచ్చే 'ఎల్లో మీడియా' అతినీ ప్రజలు గుర్తించాలి. ఇంతెందుకు ? ఒక్క మాటలో చెప్పాలంటే స్వయంకృతాపరాధం.

ఎన్నికల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు

సమస్యాత్మక కేంద్రాల వద్ద లైవ్ కెమెరాలు
ఎన్నికల నిర్వహణకు సిద్ధమయిన అధికారులు

ఆదిలాబాద్,జనవరి21(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగియడంతో పాటు, 22న ఎన్నికకు సంబంధించి అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఉదయం పోలింగ్ నుంచి పోలింగ్ ముగిసి బ్యాలెట్ బాక్సులను నిర్దేశిత స్థలాలకుచేర్చే వరకు పక్కాగా కలెక్టర్ దివ్య దేవరాజన్ ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆయా ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులకు ఎన్నికల బాధ్యతలను అప్పగించారు. ఈ బాధ్యతలు చేపట్టిన అధికారులు ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వివిధ విభాగాల వారీగా బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఇద్దరు లేదా ముగ్గురు అధికారులు విధులు నిర్వహించనున్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల గుర్తింపు ,పోల్ చీటీల పంపిణీ పూర్తయ్యింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని ఇదివరకే నియమించగా.. వారికి దశల వారీగా శిక్షణ సైతం పూర్తి చేశారు. పట్టణంలో 49 వార్డులు ఉండగా.. 183 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 1,306 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. ఫ్లయింగ్ స్కాడ్, ఎస్ఎస్ టీంలు, అసిస్టెంట్ ఎలక్షన్ అధికారులు, వ్యయ పరిశీలకులతోపాటు సమస్యాత్మక కేంద్రాల వద్ద మైక్రో అబ్జర్వర్లను నియమించారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద మైక్రో అబ్జర్వర్లను నియమించారు. పట్టణ సరిహద్దు గుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి స్టాటిస్టికల్ సర్వైలెన్స్ టీం (ఎస్ఎస్‌టీ)లను సైతం ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ ఎలక్షన్ అధికారితో పాటు వ్యయ పరిశీలకులను నియమించారు. మొత్తం 44 లోకేషన్లలో 23 అతి సమస్యాత్మక, 21 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నట్లు అధికారులు, పోలీసులు సంయుక్తంగా సర్వేచేసి నిర్ధారించారు. ఈ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలను చేపట్టారు. వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించేందుకు మైక్రో అబ్జర్వర్‌లను నియమించారు. ఎన్నికల రోజు ప్రత్యేక బృందాలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఎప్పటికప్పుడు సరళిని తెలుసుకొని రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమాచారం చేరవేస్తాయి. పోలింగ్ బూత్‌లో విధులు నిర్వహించే అధికారులతో పాటు పర్యవేక్షణ, ఇతర విధులను నిర్వహించేందుకు అధికారులను జిల్లా ఎన్నికల అధికారి కేటాయించారు. ప్రిసైడింగ్ అధికారులు (పీవో), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, (ఏపీవో), స్టాటిస్టికల్ టీంలను ఏర్పాటు చేసి ఒక్కో టీంలో ముగ్గురు అధికారులను నియమించారు. వెబ్‌కామ్‌లను ఏర్పాటు చేసి జీపీఎస్ సిస్టంతో కలెక్టర్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయంతో పాటు రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయానికి అనుసంధానం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు పోలింగ్ సరళిని పరిశీలిస్తూ ఏమైనా సంఘటనలు చోటు చేసుకుంటే అప్పటికప్పుడు అప్రమత్తం చేయనున్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో భారీ బందోబస్తు

సమస్యాత్మక కేంద్రాల్లో అదనపు సిబ్బంది
పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు : సీపీ ఇక్బాల్

ఖమ్మం,జనవరి21(ఆర్ఎన్ఎ): బుధవారం ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన భారీ బందోబస్తును పోలీసు యంత్రాంగం ఏర్పాటు చేసింది. జిల్లాలోని వైరా, మధిర, సత్తుపల్లి మున్సిపాలిటీల పోలింగ్‌కు అధికారులు పట్టిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ సారధ్యంలో శాంతిభద్రతల పర్యవేక్షణ చేపట్టారు. జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అదనపు బలగాలను ఏర్పాటు చేశారు. ఒకొక్క మున్సిపాలిటీకి ఒక అడిషనల్ డీసీపీ చొప్పున ముగ్గురు అడిషనల్ డీసీపీల ఆధ్వర్యంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. మూడు మున్సిపాలిటీల పరిధిలో ఉన్న 115 పోలింగ్ కేంద్రాల్లో ఐదుగురు ఏసీపీలు, 600 మంది సివిల్, ఏఆర్ పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. సమస్యాత్మక వార్డులను గుర్తించి అల్లర్లకు పాల్పడే, నేరచరిత్ర ఉన్న వ్యక్తులు, రౌడీషీటర్ల జాబితాను తయారు చేసి బైండోవర్ కేసులు నమోదు చేశారు. మొత్తం 115 పోలింగ్ కేంద్రాల్లో 39 లోకేషన్లు, 22 క్రిటికల్ పోలింగ్, రెండు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. స్టాటిక్ సర్వే లైన్స్ టీమ్ బృందాలు, ఫ్లయింగ్ స్కాడ్స్, మోడల్ కోడ్ ఆఫ్ టీమ్స్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. మూడు మున్సిపాలిటీల పరిధిలో తొమ్మిది చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారు. దాంతో పాటు రూట్ మొబైల్స్, స్టైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్టైకింగ్ ఫోర్స్‌లను అందుబాటులో ఉంచారు. పోలింగ్ కేంద్రాల నుంచి సుమారు వంద మీటర్ల దూరం వరకు గుంపులుగుంపులుగా ప్రజలు ఉండకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. పోలింగ్ చిట్టీలను పరిశీలించి తరువాతనే కేంద్రాల్లోకి అనుమతించే విధంగా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో పోలీస్ సిబ్బంది వదిలి వెళ్లకుండా సీపీ ఆదేశాలు జారీ చేశారు. సమస్యాత్మకంగా గుర్తించిన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తయ్యేందుకు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు.

ఇందిరా స్టేడియంలో గణతంత్ర వేడుకలు

కామారెడ్డి,జనవరి21(ఆర్ఎన్ఎ): గణతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఇక్కడ పరడే÷– ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సత్యనారాయణ ఆదేశించారు. జనహిత భవన్ గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై ఇటీవల సమీక్షించగా ఆ మేరకు అధికారులు చర్యలకు దిగారు. ప్రభుత్వ శాఖలు సాధించిన పురోగతిపై నివేదికలను ముఖ్య ప్రణాళిక అధికారికి అందజేయాలని సూచించారు. స్టాల్స్, ట్యాబ్ ఏర్పాట్లపై శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ ఓటర్ డే, ప్లలె ప్రగతిపై ప్రత్యేక ట్యాబ్ (శకటాలు) ఏర్పాటు చేయాలన్నారు. పల్లెప్రగతిలో ఉత్తమ గ్రామ పంచాయతీలను మూడు విభాగాల్లో ఎంపిక చేసి ఉత్తమ సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ ప్రతిపాదనలు పంపాలన్నారు. ఉపాధి హమీ పథకం ద్వారా మున్సిపల్ అనుబంధ శాఖల సమన్వయంతో ట్రెంచ్, ఫాంపాండ్, ఇంకుడు గుంతలు, హరితహారం పూర్తి స్థాయిలో చేపట్టడం ద్వారా జిల్లాకు జాతీయస్థాయిలో సిల్వర్ అవార్డు లభించిందని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాశివనం, పోలీస్ ఫాంపాండ్ ద్వారా వాటర్ రిచార్జ్ చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

నడ్డా నెత్తిన అతిపెద్ద బాధ్యత

హైదరాబాద్, జనవరి 21:భారతీయ జనతా పార్టీ చరిత్రలో అమిత్‌షా ఇన్నింగ్స్ అద్భుతమనే చెప్పాలి. పార్టీ అధ్యక్షుడిగా ఆయన బిజెపిని విజయతీరాలకు చేర్చడమే గాకుండా, పలు రాష్ట్రాల్లో బలమైన పునాదులు వేశారు. బిజెపి పరిస్థితి ని ఇప్పుడు అమిత్ షాకు పూర్వం..తరవాత అన్నంతగా పార్టీని ఆయన బలోపేతం చేశారు. మోడీతో పాటు గుజరాత్ నుంచి హస్తినకు చేరుకున్న అమిత్‌షా దేశంలో బిజెపిని తిరుగులేని పార్టీగా తీర్చిదిద్దడంలో తనదైన ముద్ర వేశారు. పార్టీని పటిష్టం చేయడంలో రాజీపడలేదు సరికదా..విమర్శలకు సైతం వెరవలేదు. హోంమంత్రిగా ఎంతటి కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారో అంతకు మించి పార్టీని ప్రజల్లోకి తీసుకుని వెళ్లడంతో బాగా కృషి చేశారు. బిజెపిక స్వర్ణయుగం అన్నంతగా జాతీయ అధ్యక్షుడుగా అమిత్ షా పనిచేశారు. పార్టీని ప్రజల్లో నిలిపారు. షా హయాంలో బిజెపి పూర్తి మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు చేయడం, వివిధ రాష్ట్రాల్లో అధికారంలోకి రావడం మాత్రమే కాకుండా సైద్ధాంతికంగా బిజెపికున్న హిందూభావ జాలాన్ని ప్రజల్లో కూడా చర్చ చేయించారు. ఇన్నాళ్లు స్తబ్దుగా ఉన్న బిజెపి కార్యక్రమాఉల, కేంద్ర నిర్ణయాలు ఇవాళ ప్రజల్లో చర్చ చేసేలా చేసిన సిద్ధహస్తుడుగా అమిత్‌షాను గుర్తించాలి. పౌరచట్టం విషయంలో ప్రజలు మంచీచెడులను విశ్లేషించే స్థాయికి తీసుకుని వెళ్లడంలోనూ అమిత్ షా వ్యూహం మనకు గోచరిస్తుంది. నిర్మాణ పరంగా కూడా అమిత్ షా హయాంలో బిజెపి ఒక సమున్నత స్థానానికి చేరుకుంది. 2014 జూలై 9న పార్టీ జాతీయ అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచీ కొత్త అధ్యక్షుడుగా జగత్ ప్రకాశ్ నడ్డా బాధ్యతులు చేష్టటే వరకు అమిత్ షా బిజెపి చరిత్రలో ఒక మహోజ్జ్వల ఘట్టాన్ని లిఖించారనడంలో అతిశయోక్తి లేదు. బిజెపిలో అద్వానీ తరవాత అంతటి సమర్థ అధ్యక్షుడిగా అమిత్ షా మాత్రమే చెప్పుకోగలం.

ఇక రానున్న కాలంలో కొత్త అధ్యక్షుడు నడ్డా ఏ విధంగా వ్యవహరించి పార్టీని గట్టెక్కిస్తారన్నది చూడాలి. దేశరాజధానిలో త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు భారతీయ జనతాపార్టీ జాతీయాధ్యక్షుడిగా జగత్ ప్రకాశ్ నడ్డాకు తొలి పరీక్షగా భావించాలి. అధ్యక్ష హోదాలో ఆయన ఎదుర్కోబోతున్న తొలి పరీక్ష కూడా ఇదే. ఎన్నికల్లో చక్రం తిప్పేది మోదీ,అమిత్ ద్వయమే అయినప్పటికీ, ఇక్కడ విజయం దక్కితే నడ్డా పేరు కూడా మార్మోగుతుంది. నడ్డాను అద్భుతమైన కార్యకర్తగా అభివర్ణించిన ప్రధాని మోదీ ఆయన నేతృత్వంలో పార్టీ పలు విజయాలు సాధిస్తుందన్న ఆశాభావం కూడా వ్యక్తంచేశారు. అయితే బిజెపిని ఉన్నతస్థానానికి తీసుకుని వెళ్లడమే గాకుండా జాతీయ స్థాయి పార్టీ అయిన కాంగ్రెస్‌ను మట్టి కరిపించిన వ్యక్తిగా అమిత్ షా పాత్ర తిరుగులేనిది. ఐదున్నరేళ్ల పదవీకాలంలో పార్టీని దేశవ్యాప్తంగా విస్తరించడంతో పాటు, ఆయన హయాంలోనే కేంద్రంలో రికార్డుస్థాయి మెజారిటీతో బీజేపీ మరోమారు అధికారంలోకి వచ్చింది. ఇరవైయొక్క రాష్ట్రాల్లో పార్టీని అధికారంలో కూచోబెట్టిన ఘనత అమిత్ షాది మాత్రమే. 8కోట్లమంది సభ్యులతో పార్టీని విస్తరించడం, అట్టడుగుస్థాయి నుంచీ దానిని బలోపేతం చేయడంతో పాటు, ప్రతీ ఎన్నికనీ తీవ్రంగా తీసుకొని విజయం కోసం అహర్నిశలూ శ్రమించే తత్వాన్ని ఆయన పార్టీకి అలవర్చారు. ఐదేళ్ళకాలంలో అమిత్ షా పార్టీకోసం సుమారు 8లక్షలకిలోమీటర్లు ప్రయాణించారనీ, వేలాదిగా పార్టీ కార్యాలయాలు ప్రారంభించారనీ అంటారు. బలం లేని చోట కూడా దూకుడుగా పోయి అనుకున్నది సాధించడమనే ఆయన లక్షణంగా గర్తించవచ్చు. తెలంగాణలో నాలుగు సీట్లు గెల్చుకోవడం వెనకా అమిత్ షా వ్యూహం ఉందనే చెప్పాలి. అయితే పూర్తి భిన్నంగా కనిపించే ప్రస్తుత అధ్యక్షుడు నడ్డా విద్యార్థి దశనుంచీ మృదుభాషి అన్న పేరుంది. పదేళ్ళక్రితం పార్టీ జాతీయ కార్యదర్శిగా ఢిల్లీలో అడుగుపెట్టడానికి గడ్కరీతో ఉన్న స్నేహం ఉపకరిస్తే, 1990లలో హిమాచల్ ప్రదేశ్ బిజేపీ వ్యవహారాల ఇంచార్జిగా నరేంద్రమోదీ ఉన్నప్పుడు ఏర్పడిన సాన్నిహిత్యం ఇప్పుడు పార్టీ అధ్యక్షపదవిని అందుకోవడానికి దోహదపడిందని అంటారు. అయితే ఆయన మెత్తనా, లేక గట్టి వాడా అన్నది నిరూపించుకునే సమయం వచ్చింది. వడ్డించిన విస్తరిని అమిత్ షా అందించారు. దాన్ని ఎలా కాపాడుతారాన్నదే ఇక్కడ ముఖ్యం. ఢిల్లీ, బిహార్, ఇంకా చెప్పాలంటే 2021పశ్చిమబెంగాల్ ఎన్నికలు నడ్డా హయాంలోనే జరగబోతున్నాయి. ఇక్కడ విజయాలు కూడగట్టడంతోపాటు, అమిత్ షా కాలంలో నష్ట పోయిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ఇత్యాది చోట్ల పార్టీకి పునరుజ్జీవం కల్పించాల్సిన బాధ్యత కూడా ఆయనమీద ఉంది. కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలో నరేంద్రమోదీ ప్రధానమంత్రి పదవిని చేపట్టాలంటే ఉత్తర ప్రదేశ్‌లో అత్యధిక సీట్లు సాధించాలని ఆయనకు తెలుసు. ఆయన ఎన్నికల వ్యూహ పటిమకు నిదర్శనంగా ఉత్తర ప్రదేశ్‌లోని 80 సీట్లలో 73 సీట్లు బిజెపి, మిత్రపక్షాలకు దక్కాయి. ఇది కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించింది. ఉత్తర ప్రదేశ్‌లో అమిత్ షా సాధించిన విజయమే 2014 జులైలో ఆయన పార్టీ అధ్యక్ష పదవి చేపట్టేందుకు దారి తీసింది. పార్టీ అధ్యక్ష పదవి చేపట్టడమంటే కేవలం ఎన్నికల్లో పార్టీకి విజయం సాధించి పెట్టడమే కాదు, పార్టీని ఒక బలమైన సంస్థగా రూపొందించడం కూడా ముఖ్యం. ఇప్పుడు నడ్డా కూడా ఇలాంటి వ్యూహాలతో ముందుకు సాగాల్సి ఉంటుంది. అందులో ఆయన ఏ మేరకు విజయం సాధిస్తారన్నది ఢిల్లీ ఎన్నికల ఫలితాలే తొలి టెస్ట్‌గా భావించాలి.

అమిత్ షా అద్భుత ఇన్నింగ్స్

ఆసేతు హిమాచలం వరకు పార్టీ ప్రతిష్ట
బిజెపిని ప్రజల పార్టీగా తీర్చిదిద్దిన ఘనుడు అమిత్ షా
కఠోర పరిశ్రమ, అకుంఠిత దీక్ష వల్లనే ఇది సాధ్యం

న్యూఢిల్లీ,జనవరి21(ఆర్ఎన్ఎ): మతతత్వం పార్టీ ముద్రవేసిన బిజెపిని అందరి పార్టీగా ఆమోదింప చేయడంలో పార్టీ అధ్యక్షుడుగా అమిత్ షా చేసిన కృషి అమోఘం. ఆయన పార్టీని విజయతీరాలకు చేర్చడే గాకుండా అన్ని వర్గా ప్రజలను అందులోకి రప్పించారు. బిజెపితో అంతా కలసి పోయేలా చేసిన సమర్థ నాయకుడిగా అమిత్ షా గొప్పతనాన్ని గుర్తించాల్సిందే. జనసంఘ్ కాలం నుంచీ పార్టీ అంచెలం చెలుగా బలోపేతం కావడం, లాల్ కృష్ణ ఆద్వాణీ హయాంలో బిజెపి దాదాపు అన్ని రాష్ట్రాల్లో బలమైన నిర్మాణాల ను ఏర్పర్చుకోవడం జరిగింది. అంతటి పటిష్ట నాయకుడి తరవాత మళ్లీ అమిత్ షా హయాంలో పార్టీ ఒక తిరుగులేని శక్తిగా మారింది. అద్వానీ తరవాత అంతటి సమర్థ నాయకుడిగా అమిత్ షా తన అధ్యక్ష పాత్రను అద్భుతంగా నిర్వహించారు. తన కెపెన్సీలో అద్భుతాలు సాధించారు. అనేక రాష్ట్రాల్లో పార్టీని బలోపేతం చేసి, అధికారం కట్టబెట్టారు. అద్వానీ తరవాత పార్టీ బాధ్యతలతో పాటు, హోంమంత్రిత్వ శాఖను కూడా సమర్థంగా నిర్వహిస్తున్నారు. బలమైన సభ్యత్వం ఉన్న పార్టీకి బలమైన నిర్మాణం ఏర్పడుతుందని, అది తర్వాతి కాలంలో ఎన్నికల్లో విజయానికి దారి తీస్తుందని అమిత్ షా విశ్వసించారు. ఆయన వ్యూహరచన ఫలితంగానే గత సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి పశ్చిమ బెంగాల్‌లో 40 శాతం ఓట్లతో 18 సీట్లను సాధించ గలిగిం ది. మూడు దశాబ్దాలుగా ఆ రాష్ట్రాన్ని ఏలిన మార్క్సిస్టు పార్టీ కేవలం ఆరు శాతం ఓట్లకే కుదించుకుపోగా, వందేళ్లకు పైగా చరిత్ర ఉన్నదని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీకి 5 శాతం కంటే తక్కువ ఓట్లు వచ్చాయి. కొన్నేళ్ల క్రితం పశ్చిమ బెంగాల్‌లో ఏ నిర్మాణమూ లేని బిజెపి ఇవాళ ప్రతి నియోజకవర్గం లోనూ బలంగా వేళ్లూను కుంది. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌లో బిజెపికి రికార్డు స్థాయిలో 77 లక్షలమంది సభ్యులున్నారంటే అది అమిత్ షా అమలు చేసిన వ్యూహరచన వల్లే సాధ్యపడింది. వామపక్షాలను తుడిచిపెట్టి బిజెపి అధికారంలోకి వచ్చిన త్రిపురలో కూడా పార్టీ 10 లక్షలమంది సభ్యులను సంపాదించు కోగలిగింది. ఇదే వ్యూహం అమిత్ షా దేశమంతటా అనుసరించారు. దక్షిణాది రాష్ట్రాల్లో కూడా దాదాపు కోటి మంది కొత్త సభ్యులను చేర్చుకున్నారు. అమిత్ షా హయాంలో భారతీయ జనతా పార్టీ దేశమంతటా ఒక బలమైన పునాదిని నిర్మించుకుని కేవలం హిందీప్రాంత పార్టీగా తనపై పడ్డ ముద్రను పూర్తిగా తొలగించు కోగలిగింది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, కచ్ నుంచి కోహిమా వరకు ఇవాళ బిజెపి ఉనికి లేని రాష్ట్రం లేదని సగర్వంగా చెప్పుకోగలుగుతోంది. 2015 మార్చిలో అమిత్ షా హయాంలో ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీగా మారే సమయానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కనీసం ఒక ఏడాది కూడా పూర్తి చేసుకో లేదు. అమిత్ షా 2014 జూలైలో పార్టీ బాధ్యతలు స్వీకరించే నాటికి బిజెపి సభ్యుల సంఖ్య కేవలం 3,60,000 మాత్రమే. కాని అనతికాలంలోనే అమిత్ షా బిజెపిని ప్రపంచంలో అతి పెద్ద పార్టీగా మార్చగలిగారు. అంటే ఇది ఆయన మేధోశక్తికి, కఠోర పరిశ్రమకు నిదర్శనంగా చూడాలి. వివిధ రాష్ట్రాల్లో ఆ పార్టీని అధికారంలోకి తేగలిగారంటే సామాన్యమైన విషయం కాదు. అమిత్ షా పార్టీ పగ్గాలు చేపట్టిన వెంటనే సభ్యత్వ నమోదుకు సంబంధించి పాత నిబంధనలను సడలించి కొత్త సంస్కరణలను ప్రవేశపెట్టారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆధునిక టెక్నాలజీనివిస్తృతంగా వినియోగించారు. ఆన్ లైన్, మొబైల్ ద్వారా సభ్యులను చేర్చుకునే పక్రియను ప్రారంభించారు. ప్రాథమిక, క్రియాశీలక సభ్యుల విషయంలో కూడా ఆయన కీలక మార్పులు చేపట్టారు. వందమంది సభ్యులను చేర్పించి, పార్టీ కార్యక్రమాల్లో సాధ్యమైనంత ఎక్కువ కాలం చురుకుగా పాల్గొన్న వారిని క్రియాశీలక సభ్యులుగా గుర్తించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రక్షాళన చేసి డిజిటల్ పక్రియను ప్రవేశపెట్టారు. సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకున్నారు. ఆయన అనుసరించిన పద్ధతుల వల్ల పార్టీకి బలమైన పునాది ఏర్పడడమే కాక విస్తరణకు అద్భుతంగా దోహదం జరిగింది. 'సదస్యతా మహా అభియాన్' పేరిట అమిత్ షా ప్రారంభించిన ఒక బృహత్తర యజ్ఞం వల్లనే బిజెపి ఇవాళ ప్రపంచంలో అతిపెద్ద రాజకీయ పార్టీగా మారిందనడంలో సందేహం లేదు. ఈ అభియాన్‌ను మరో 'దండి యాత్ర'గా అభివర్ణించిన అమిత్ షా సభ్యత్వ నమోదును సీరియస్‌గా తీసుకుని ముందుకు సాగారు. స్వయంగా ప్రచార కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు దేశమంతటా వేల కిలో మీటర్ల దూరం పర్యటించారు. సభ్యత్వ లక్ష్యాలను అమిత్ షా పార్టీ నేతలకు అలవోకగా నిర్దేశించలేదు. ప్రతి రాష్ట్రంలోనూ బిజెపి సభ్యుల సంఖ్య, పోలైన ఓట్లు, సానుభూతిపరులు, ప్రజల్లో కనిపించిన ప్రతిస్పందన ఆధారంగా ఆయన సభ్యత్వ లక్ష్యాలను నిర్దేశించారు. దీనదయాళ్ ఉపాధ్యాయ స్ఫూర్తిదాయక మాటలను ఆయన ఆచరణలో రుజువు చేసి చూపించారు. 370 ఆర్టికల్ రద్దు, ట్రిపుల్ తలాక్, అయోధ్య, పౌరసత్వ సవరణ చట్టం వంటి కీలక అంశాల్లో అమిత్ షా ముద్రను స్పష్టంగా చూడవచ్చు. అంతేగాకుండా బలమైన అభిప్రాయంతో వీటిని ముందుకు తసీఉకుని వెళ్లగల

భారీ రోడ్ షోతో ట్రాఫిక్ జామ్

నామినేషన్ వాయిదా వేసుకున్న కేజ్రివాల్

ఢిల్లీ,జనవరి21(ఆర్ఎన్ఎ): ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సోమవారం నామినేషన్ వేయలేకపోయారు. నామినేషన్ సందర్భంగా నిర్వహించిన రోడ్‌షోలో సీఎం కేజ్రీవాల్‌తో పాటు ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా పాల్గొన్నారు. తన తల్లిదండ్రుల దగ్గర నుంచి ఆశీర్వాదం తీసుకొన్న కేజ్రీవాల్ రోడ్‌షో ద్వారా నామినేషన్ వేసేందుకు బయలుదేరారు. వాల్మీకి ఆలయం నుంచి జామ్నాగర్ హౌస్ వరకూ రోడ్‌షో ద్వారా వచ్చి సీఎం కేజ్రీవాల్ నామినేషన్ వేయాల్సి ఉంది. కేజ్రీవాల్ వాహనం వెంట భారీగా మద్దతుదారులు, ఆప్ కార్యకర్తలతో రహదారులు కిక్కిరిసిపోయాయి. దీంతో ఆయన సరైన సమయానికి ఎన్నికల కార్యాలయానికి వెళ్లలేకపోయారు, రహదారుల వెంట చేరిన కేజ్రీవాల్ మద్దతుదారులు చీపురు(ఆప్ ఎన్నికల గుర్తు)ను చూపిస్తూ ఆహ్వానం పలికారు. 'నేను నామినేషన్ వేయాలనుకున్నాను. కానీ రోడ్‌షోలో పాల్గొన్న ప్రజలను వదిలి ఎలా వెళ్లేది? అందుకే రేపు నామినేషన్ వేయాలని నిర్ణయించుకున్నాను' అని కేజ్రీవాల్ మీడియా ప్రతినిధులకు తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటల్లోపు ఎన్నికల కమిషనర్‌కు నామినేషన్ పత్రాలు అందజేయాల్సి ఉంది. కానీ ఆ సమయానికి ఆయన ఇంకా రోడ్‌షోలోనే ఉండటంతో నామినేషన్ వేయలేకపోయారు. మంగళవారంతో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేసేందుకు ఆఖరి రోజు. మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు గాను ఫిబ్రవరి 8న పోలింగ్ నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 11న ఓట్ల లెక్కింపు జరగనుంది. మొత్తం 1.46కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఆప్ మరోసారి అధికారం చేపట్టాలని ఆశిస్తోంది. గత ఎన్నికల్లో 70 సీట్లకు గాను 67 స్థానాల్లో ఆప్ గెలుపొందింది. మరోవైపు లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీ అసెంబ్లీ పరిధిలో ఉన్న 7 లోక్‌సభ స్థానాలను గెలిచిన బిజెపి అసెంబ్లీ ఎన్నికల్లోనూ సత్తా చాటాలని చూస్తోంది.

మసీదులో హిందూ పెళ్లి

-కేరళలో వెల్లివిరిసిన మతసామరస్యం

తిరువనంతపురం,జనవరి21(ఆర్ఎన్ఎ): కేరళలో మతసామరస్యం వెల్లివిరిసింది. చెరవల్లిలోని ముస్లిం జమాత్ మసీదులో హిందూ పెళ్లి జరిగింది. మసీదు ఆవరణలో పూజారి ఆధ్వర్యంలో సంప్రదాయం ప్రకారం అంజు, శరత్‌లు ఏకమయ్యారు. వారి బంధుమిత్రుల పర్యవేక్షణలో మసీదు పెద్దలే ఈ పెళ్లి నిర్వహించడం విశేషం. పెళ్లి అనంతరం శాకాహార విందు సైతం ఏర్పాటు చేశారు. పేద కుటుంబానికి చెందిన పెళ్లి కూతురి తల్లి.. మసీదు పెద్దల సాయం కోరారు. మానవత్వంతో వ్యవహరించిన వారు పెళ్లికి బంగారం, రెండు లక్షల నగదు ఆర్థిక సాయం అందజేసి ఆ పిల్ల పెళ్లి కలను సాకారం చేశారు.

బంధువులు,మిత్రులకు భోజనాలు ఏర్పాటు చేసినట్లు మసీదు కమిటీ కార్యదర్శి నుజుముద్దీన్ చెప్పారు. ఈ పెళ్లిపై కేరళ సీఎం పినరయి విజయన్ స్పందించారు. రాష్ట్రంలో మత సామరస్యానికి గుర్తుగా ఈ పెళ్లి నిలుస్తోందని కొనియాడారు. సీఏఏ, ఎన్నార్సీలపై దేశమంతా నిరసనలు వెల్లువెత్తుతున్న వేళ ఈ పెళ్లి ఆదర్శనీయమైనదని అభిప్రాయపడ్డారు.

భారత్ నిర్ణయాన్ని ప్రతిఘటించలేము

-మలేషియా ప్రధాని మహతిర్ మహ్మద్

కౌలాలంపూర్ ,జనవరి21(ఆర్ఎన్ఎ): పామాయిల్ కొనుగోలు చేయకూడదంటూ భారత్ తీసుకున్న నిర్ణయాన్ని తాము ప్రతిఘటించలేమని మలేషియా ప్రధాని మహతిర్ మహ్మద్ అన్నారు. కశ్మీర్ అంశంపై దాయాది దేశం పాకిస్థాన్‌కు అనుకూలమైన రీతిలో వ్యవహరిస్తున్న మలేషియా నుంచి పామాయిల్ కొనుగోలు చేయకూడదని ముంబయిలోని సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్(ఎన్ఈఏఐ) నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన దీనిపై స్పందించారు. 'మేం చాలా చిన్నవాళ్లం. భారత్ నిర్ణయాన్ని ప్రతిఘటించలేము. దీన్ని అధిగమించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతాం' అని ఆయన పేర్కొన్నారు. ఇండోనేషియా తర్వాత అతిపెద్ద పామాయిల్ ఉత్పత్తిదారుగా దేశంగా మలేషియా ఉంది. గత ఐదేళ్లుగా భారత్ మలేషియా నుంచి పామాయిల్‌ను దిగుమతి చేసుకుంది. పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)పై ఆయన మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సీఏఏ అమలు నిర్ణయం చాలా అన్యాయమని ఆయన పేర్కొన్నారు. లౌకిక దేశం అని చెప్పుకునే భారత్ ఇప్పుడు కొందరు ముస్లింల పౌరసత్వాన్ని తొలగించేందుకు చర్యలు చేపట్టడం బాధాకరమంటూ మహతిర్ నిన్న వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలు భారత విదేశాంగశాఖ తీవ్రంగా వ్యతిరేకించింది. భారత్ అంతర్గత వ్యవహారాల్లో మలేషియా జోక్యం చేసుకోవడం సరికాదని హితవు పలికింది.

ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసేవారిని కాల్చేయాలి

-ప.బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు దిలీప్ ఘోష్

కోల్‌కత్తా,జనవరి21(ఆర్ఎన్ఎ): పశ్చిమ బెంగాల్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ ఘోష్ మళ్లీ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఏఏపై ఇప్పటికే వివాదాస్పద వ్యాఖ్యలు చేసి వార్తల్లో నిలిచిన ఈయన ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వ ఆస్తులకు ఎవరైనా నష్టం కలిగిస్తే వారిని కాల్చిపారేయాలి అంటూ మండిపడ్డారు. ఎవరైతే పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తారో వారిని కాల్చేయాలి. నా ప్రకటన తప్పు అని ప్రజలు భావిస్తే, శాంతియుత ప్రదర్శనలో పాల్గొన్న నిరసనకారులను కాల్చిపారేసిన పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మొదట క్షమాపణలు చెప్పాలని పేర్కొన్నారు. సీఏఏను వ్యతిరేకిస్తూ ఆందోళన చేసిన వారిపై యూపీ ప్రభుత్వం కేవలం కేసులను నమోదు చేయడమే కాకుండా వారిపై లాఠీఛార్జీ చేసి, కాల్చిపారేశారు.

ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే వారిపై మేము కూడా లాఠీచార్జీ చేసి, కాల్చిపారేస్తాం అని వ్యాఖ్యానించారు. కొన్ని రోజుల క్రితం కూడా దిలీప్ ఘోష్ నిరసనకారులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేస్తున్న వారిని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కుక్కలను కాల్చినట్లు కాల్చేశామని, మిగితా రాష్ట్రాల్లో కూడా ఇలాగే కాల్చేయాలని వ్యాఖ్యానించారు. ఇక మరోసారి... సీఏఏను వ్యతిరేకించే మేధావులు వెన్నెముక లేనివారని, వారంతా దయ్యాలు, పరాన్నభుక్తులని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

ఎయిడ్స్ బారిన పడుతున్న వారిలో యువతే ఎక్కువ

యువతలో హెచ్ఐవి పై అవగాహనకు కృషి

హైదరాబాద్,జనవరి21(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ఎయిడ్స్ వ్యాధి సోకుతున్న వారిలో 40శాతం మంది 15 నుంచి 24 మధ్య వయస్సు గల వారే ఉన్నారని ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ స్పష్టంచేసింది. ప్రతి రోజూ 2400 మంది ఎయిడ్స్ బారిన పడుతున్నారని వెల్లడించింది.

ప్రస్తుతం 5మిలియన్‌ల యువత ఎయిడ్స్ వ్యాధితో జీవిస్తున్నారని తెలిపింది. ఈ పరిస్థితులు ఆందోళన కలిగించేవేనని అధికారులు తెలిపారు. యువతలో హెచ్ఐవి పై అవగాహన కల్పించేందుకు తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రతి సంవత్సరం జనవరిలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవాలను నిర్వహిస్తోంది.

అందులో భాగంగానే ఈ సంవత్సరం 'దేశ నిర్మాణంలో యువత పాత్ర' అన్ననినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించింది.

జాతీయ యువజన దినోత్సవాన్ని ఖైరతాబాద్‌లోని గవర్నమెంట్ డిగ్రీఅండ్ పీజీ కాలేజీలో జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

విద్యార్థినీ, విద్యార్థుల్లో స్వామి వివేకానందుడి ఆశయస్ఫూర్తిని నింపడంతో పాటు వారు వ్యక్తిగతంగా , భవిష్యత్తులో కాబోయే భారత పౌరులుగా హెచ్ఐవి వంటి వ్యాధుల బారినపడకుండా ఎలా జీవించాలన్న విషయాలను ప్రచారం చేయాలని నిర్ణయించారు.

ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది....ఎలా నివారించవచ్చు...ఎవరికి హెచ్ఐవి సోకే ప్రమాదం ఉంది...అన్నవిషయాల పై అవగాహన కల్పిస్తామని అధికారులు తెలిపారు. అలాగే హెచ్ఐవి పై ఉన్న అపోహలు, పరీక్షలు ఎక్కడ చేస్తారు? అందులో ఉన్న చికిత్స వివరాలపై కూడా ప్రచారం కల్పించడం, వ్యాసరచన, పెయింటింగ్,స్కిట్ పోటీలను నిర్వహించి విజేతలను ఎంపిక చేస్తామని అధికారులు తెలిపారు.

స్వేచ్ఛగా ఓటేసేలా పక్కాగా ఏర్పాట్లు

భారీగా పోలీస్ బందోబస్తు

అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చర్యలు

మూడు మున్సిపాలిటీల్లో 80 వార్డులు, 188 పోలింగ్ బూత్‌లు

-కలెక్టర్ ఎన్. సత్యనారాయణ

కామారెడ్డి,జనవరి21(ఆర్ఎన్ఎ): జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో పోలింగ్ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సత్యనారాయణ తెలిపారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రశాంత

వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని సిద్ధం చేశామని వివరించారు. ఎన్నికల పక్రియలో ప్రజలంతా పాల్గొని తమకు నచ్చిన నాయకులను ఎన్నుకోవాలన్నారు. ఓటు వేసి పౌరుడిగా తమ బాధ్యతను నెరవేర్చాల్సిందిగా కోరారు. స్వేచ్ఛాయుతంగా ఓటు వేసేందుకు ప్రభుత్వ యంత్రాం గం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనబోయే సిబ్బందికి ఆయా పోలింగ్ కేంద్రాల బాధ్యతలు అప్పగించామని అన్నారు. స్థానికేతరులకే ఎన్నికల విధులు అప్పగించి పారదర్శకంగా పోలింగ్‌ను చేపట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. సమస్యాత్మక, అతి సున్నిత పోలింగ్ కేంద్రాలను గుర్తించి బందోబస్తుకు ఏర్పాట్లు చేసారు. ఏడాది కాలంలో ఎదుర్కొన్న అసెంబ్లీ, లోక్‌సభ, పంచాయతీ, పరిషత్ ఎన్నికల అనుభవాలతో ముందుకు సాగుతున్నామని, ఎక్క డా అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఇకపోతే ÷ఔడు మున్సిపాలిటీల్లో బుధవారం జరిగే ఎన్నికలకు 1,130 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు.

కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీల్లో ఎక్కడెక్కడ ఎన్ని పోలింగ్ బూతులు ఏర్పాటు చేశారు?

జిల్లాలో మూడు మున్సిపాలిటీల్లో 80 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తున్నాం. ఇందుకోసం మొత్తం 188 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. కామారెడ్డిలో 49 వార్డులకు 126 పోలింగ్ కేంద్రాలు, బాన్సువాడలో 19 వార్డులకు 38 పోలింగ్ బూత్‌లు, ఎల్లారెడ్డిలో 12 వార్డులకు 24 పోలింగ్ స్టేషన్లు అందుబాటులో తెచ్చారు. ఎన్నికల నిర్వహణకు 16మంది జోనల్ అధికారులు, 33 మంది రిటర్నింగ్ అధికారులు, మరో 33 మంది సహాయ రిటర్నింగ్ అధికారులను నియమించారు. స్టాటిస్టిక్, వీడియో సర్వేలెన్స్, ఫ్లయింగ్ స్కాడ్, వీడియో పరిశీలన, వ్యయ పరిశీలనకు బృందాలను నియమించారు. ఒక్కో పురపాలికలో ఒక్కో బృందం పని చేస్తుంది. కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీల్లో మొత్తం 67 సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించారు.

చివరి రోజు ఇంటింటి ప్రచారం

ఓటర్లను వేడుకున్న అభ్యర్థులు

నిజామాబాద్, జనవరి21(ఆర్ఎన్ఎ): జిల్లాలోని నిజామాబాద్ కార్పొరే షన్, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. చివరి రోజు కావడంతో ఇల్లలంలూ తిరుగుతూ అభ్యర్థులు ప్రచారంలో పాల్గొన్నారు. తమకు అవకాశం కల్పించాలని ఓటర్లను అభ్యర్థించారు. టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్, ఇతర పార్టీల నేతలు స్వతంత్ర అభ్యర్థులు ప్రచారంలో పాల్గొన్నారు. టీఆర్ఎస్ పార్టీ తరపున మంత్రి ప్రశాంత్‌రెడ్డి భీమ్‌గల్‌లో సుమారు నా లుగు రోజుల పాటు ప్రచారాన్ని నిర్వహించారు. అభ్యర్థుల గెలుపునకు సహకరించాలని కోరారు. నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో ఆరు రోజుల పాటు ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్త పర్యటించారు.

పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్పొరేషన్ పరిధిలోని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో ఉన్న డివిజన్ పరిధిలో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సుడిగాలి పర్యటన జరిపారు. తమ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు. ప్రభుత్వం చే స్తున్న అభివృద్ధిని చూసి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. అభ్యర్థుల గెలుపు కోసం డివిజన్లలో పర్యటించారు. ఆర్మూర్‌లో ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్‌రెడ్డి ఇంటింటికి తిరిగారు. టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. బోధన్‌లో ఎమ్మెల్యే షకీల్ అభ్యర్థుల కోసం ప్రచారాన్ని చేశారు. వీరితో పాటు పార్టీ నేతలు ప్రచారంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ తరపున మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి బోధ న్‌లో, నిజామాబా ద్‌లో మహేష్ కు మార్‌గౌడ్, తా హెర్‌బిన్ హుం దాన్, కేశవేణు, గడుగు గంగాధ ర్‌లు ప్రచారం నిర్వహించా రు. భీమ్‌గల్, ఆర్మూర్‌లో జి ల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి ప్రచారం చేశా రు. బీజేపీ తరపున ఎం పీ అర్వింద్‌తో పాటు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ఎమ్మెల్యే రాజా సింగ్ ప్రచారంలో పాల్గొన్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో ఎంపీ అర్వింద్ ప్రచారాన్ని నిర్వహించారు. తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఓటర్లను ప్రలోభ పెట్టే కార్యక్రమాలను చేపట్టారు. అవసరమైన చోట డబ్బు, మద్యాన్ని సర్దుబాటు చేసుకుంటున్నారు. తమకు నమ్మకమైన వారి ద్వారా ఈ ప్రయత్నాలను కొనసాగించారు. మద్యం షాపులను సాయంత్రం 5.00 గం టల నుంచి మూసివేశారు. పోలీసు బందోబస్తును పెంచారు. 4 మున్సిపాలిటీల పరిధిలో ఫ్లయింగ్ స్క్వాడ్ లతో పాటు పోలీసు బృందాల గస్తీని ఏర్పాటు చేశారు.

చట్టంతో ఆడుకోవాలని చూస్తున్నారు

నిర్భయ కేసులో దోషుల తీరుపై ఆశాదేవి ఆగ్రహం

ఒక్కొక్కరిగా అందరిని ఉరితీయాలని వ్యాఖ్య

న్యూఢిల్లీ,జనవరి21(ఆర్ఎన్ఎ): నిర్భయ కేసు దోషులు చట్టంతో ఆటలాడుకోవాలని చూస్తున్నారని బాధితురాలి తల్లి ఆశాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరినీ ఒకేసారి కాకుండా ఒక్కొక్కరిని ఉరితీస్తేనే వారికి చట్టం అంటే ఏంటో తెలిసి వస్తుందని వ్యాఖ్యానించారు. ఫిబ్రవరి 1న నిర్భయ దోషులందరికీ ఉరిశిక్ష అమలైతేనే తనకు ఆత్మసంతృప్తి కలుగుతుందని ఉద్వేగానికి లోనయ్యారు. ఏడేళ్ల క్రితం దేశ రాజధానిలో చోటుచేసుకున్న నిర్భయ సామూహిక అత్యాచారం, హత్య కేసులో నలుగురు దోషులు ముఖేష్ సింగ్ (32), పవన్ గుప్తా (25), వినయ్ శర్మ (26), అక్షయ్ కుమార్ ఠాకూర్ (31)) దాదాపు రెండున్నరేళ్ల క్రితమే సుప్రీంకోర్టు మరణ శిక్ష ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఇక ఆనాటి నుంచి దోషులకు ఎప్పుడెప్పుడు శిక్ష అమలు చేస్తారా అని నిర్భయ తల్లి ఎంతో ఓపికగా ఎదురుచూస్తున్నారు. అయితే ఆనాటి నుంచి ఉరిశిక్ష నుంచి తప్పించుకోవడానికి చట్టపరమైన మార్గాలన్నింటినీ దోషులు ఉపయోగించుకుంటున్నారు.

ఈ క్రమంలో నిర్భయ దోషులను జనవరి 22 ఉదయం 7 గంటలకు తీహార్ జైల్లో ఉరి తీయాలని ఢిల్లీలోని పటియాలా హౌజ్ కోర్టు డెత్ వారెంట్లు జారీ చేసిన విషయం విదితమే.

అయితే ఉరిశిక్ష నుంచి తప్పించుకునేందుకు చివరి ప్రయత్నంగా వినయ్ శర్మ, ముఖేష్ కుమార్ సర్వోన్నత న్యాయస్థానంలో క్యూరేటివ్ పిటిషన్లు దాఖలు చేశారు. అయితే సుప్రీంకోర్టు వీటిని కొట్టివేయడంతో ఇక ఉరి అమలు జరగడమే తరువాయి అని అంతా భావించారు. కానీ ముఖేష్ క్షమాభిక్ష కోరుతూ రాష్ట్రపతికి పిటిషన్ పెట్టుకున్నాడు. అయితే అక్కడ కూడా అతడికి నిరాశే ఎదురైంది. ముఖేష్ అభ్యర్థనను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తిరస్కరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో క్షమాభిక్ష తిరస్కరించిన 14 రోజుల లోపు ఉరిశిక్ష అమలు చేయాలనే నిబంధన కారణంగా మరోసారి తేదీ మారింది. ఈ క్రమంలో ఫిబ్రవరి 1న ఉదయం ఆరు గంటలకు దోషులను ఉరితీసేందుకు రంగం సిద్ధమైంది. అయితే ఈ కేసులో మరో దోషి పవన్ గుప్తా... నిర్భయ ఘటన జరిగే నాటికి తాను మైనర్‌ను అంటూ మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ మేరకు పవన్‌కుమార్ గుప్తా తరపు న్యాయవాది సమర్పించిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీం కోర్టు సోమవారం కొట్టివేయడంతో అతడి ప్రయత్నం బెడిసికొట్టింది. ఇదిలా ఉండగా... సాధారణంగా ఒకే కేసులో ఉరిశిక్ష పడిన దోషులకు ఒకేసారి శిక్ష అమలు చేయడం పరిపాటి కాబట్టి.. పవన్, అక్షయ్ కుమార్ ఠాకూర్‌లకు మరో అవకాశం ఉన్నట్లుగా న్యాయ నిపుణులు భావిస్తున్నారు. వీరిద్దరు విడివిడిగా లేదా కలిసి క్యూరేటివ్ పిటిషన్లు, క్షమాభిక్ష పిటిషన్లు దాఖలు చేసుకునే అవకాశం ఉండటం.. అదే విధంగా వినయ్ శర్మ రాష్ట్రపతిని క్షమాభిక్ష కోరడం జరగవచ్చు.. కాబట్టి మరోసారి శిక్ష అమలు తేదీ మారే పరిస్థితులు ఉన్నట్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో పవన్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన అనంతరం నిర్భయ తల్లి మీడియాతో మాట్లాడారు. ఉరిశిక్ష నుంచి తప్పించుకోవడానికి వాళ్లు వేసిన ఎత్తుగడ మరోసారి చిత్తయింది. ఫిబ్రవరి 1న వాళ్లను ఉరితీయాల్సిందే. శిక్ష అమలును జాప్యం చేయడానికి ఒక్కొక్కరు.. ఒక్కో విధంగా ప్రయత్నిస్తున్నారు. కాబట్టి వాళ్లను సైతం ఒక్కొక్కరిగానే ఉరితీయాలి. అప్పుడే చట్టంతో ఆడుకుంటే ఏమవుతుందో వారికి అర్థమవుతుందని పేర్కొన్నారు.

స్వేచ్ఛగా ఓటేసేలా ఏర్పాట్లు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

కలెక్టర్ నారాయణరెడ్డి హెచ్చరిక

నిజామాబాద్,జనవరి21(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటువేసుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం జరిగే ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. ఓటర్ గుర్తింపు కార్డు లేదా మరో 18 ఇతర గుర్తింపు కార్డులు ఏదైనా చూపించి, ఓటర్ల జాబితాలో పేరు ఉంటే ఓటు వేయవచ్చని సూచించారు. ఎవరైనా తమది కాకుండా దొంగ ఓటు వేయడానికి ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల్లో పకడ్బందీగా తనిఖీ చేయడానికి మహిళా అధికారులను కూడా నియమించామని తెలిపారు. కేంద్రాల్లో ఓటర్లకు కనీస సౌకర్యాలు కల్పిస్తామన్నారు. హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. ముందస్తు చర్యలతో ఎన్నికల పక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో మద్యం దుకాణాలను మూసి ఉంచాలని ఆదేశించామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించాలని కోరారు. అసెంబ్లీ, మున్సిపల్ ఎన్నికల పోలింగ్ స్టేషన్లు వేర్వేరుగా ఉన్నందున, ఓటర్ల సౌకర్యార్థం ఓటర్ స్లిప్ పంపిణీ చేశామని, దాని ఆధారంగా ఓటర్లు సులభంగా ఓటు వేయవచ్చని తెలిపారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మూడు మున్సిపాలిటీల్లో 146 వార్డులు, 621 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. 100 పోలింగ్ స్టేషన్ లొకేషన్లలో వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికల పక్రియ పూర్తి చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఇదిలావుంటే బోధన్ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఓట్ల లెక్కింపు కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని మున్సిపల్ అధికారులకు అప్పగించారు. నూతనంగా నిర్మించిన ఈ కళాశాల భవనాన్ని అప్పగించేందుకు ఎన్నికల కోసం అప్పగించే విషయంలో కాంట్రాక్టర్లు కొంత ఇబ్బంది పడ్డారు. భద్రతా కారణాల దృష్ట్యా ఈ భవనం అయితే కౌంటింగ్‌కు అనుకూలంగా ఉంటుందని అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. ఇందులో బాగంగానే ఈ భవనాన్ని ఓట్ల లెక్కింపు కోసం కేటాయించారు.

ఎన్నికల రోజు వేతనంతో కూడిన సెలవు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్,జనవరి21(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ జరిగే 22వ తేదీన వేతనంతో కూడిన సెలవుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈమేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫ్యాక్టరీస్, ఎస్టాబ్లిష్‌మెంట్‌యాక్ట్ 1974 ప్రకారం పోలింగ్ రోజున తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రైవేట్ సంస్థల్లోపనిచేసేవారు, షాపుల్లోపని చేసే వారికి, పరిశ్రమలు, ఆయా సంస్థల్లో పనిచేసే వారందరికీ ఉత్తర్వు వర్తిస్తుందని అధికారులు తెలిపారు. ఇదిలావుంటే తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగియడంతో ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘంధృష్టి సారించింది. గడువు ముగిసిన తరవాత ప్రచారం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ నెల 22న పోలింగ్, 25న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఇప్పటికే 120 మున్సిపాలిటీల్లో 6,325 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 9 కార్పొరేషన్లలో 1,586 పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. మొత్తం 53,36,505 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించనున్నారు. వీరిలో పురుషులు 26,71,694, స్త్రీలు 26,64557మంది ఓటర్లు ఉన్నారు. రంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 6.40 లక్షల మంది, అత్యల్పంగా జనగామ జిల్లాలో 39,729 మంది ఓటర్లు ఉన్నారు. 69 వార్డుల్లో టీఆర్ఎస్, 3 వార్డుల్లో ఎంఐఎం అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎంపిక అయ్యారు. ఎన్నికలు పూర్తయ్యేవరకు వైన్స్, బార్లు బంద్, బల్క్ మెస్సేజ్‌లను నిషేధించారు.

తెలంగాణలో జాతీయస్థాయి బృందం పర్యటన

ఇంటింటికీ తాగునీటి సరఫరాపై అధ్యయనం

హైదరాబాద్,జనవరి21(ఆర్ఎన్ఎ): ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీటిని అందించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యసాధనలో బాగంగా నలుగురు సభ్యులు గల జాతీయ బృందం తెలంగాణలో పర్యటిస్తోంది. ఇప్పటి వరకూ మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తిచేసింది. 2024 నాటికి ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించాలనుకుంటున్న ప్రభుత్వ లక్ష్యాన్ని అందరికంటే ముందుగా తెలంగాణ సాధించిందని ప్రశంసించింది. జల్‌జీవన్ టాస్క్‌ఫోర్స్, మిషన్ భగీరథతో నల్గొండ ఎ÷-లోరైడ్ బాధితులకు న్యాయం జరిగిందని ఈ బృందం అభినందించింది. మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాలు ,ఇంటెక్ వెల్స్‌తో పాటు గ్రామాల్లో పర్యటించిన బృందం అక్కడి పరిస్థితులను పరిశీలించింది. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ప్రధాన కార్యాలయంలో ఈఎన్‌సి కృపాకర్‌రెడ్డితో భేటీ అయ్యింది. ఈసందర్భంగా మిషన్ భగీరథ ప్రాజెక్ట స్వరూపం , లక్ష్యాలను జల్‌జీవన్ టాస్క్‌ఫోర్స్‌కు భగీరథ అధికారులు వివరించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భగీరథ ప్రాజెక్టు ఫోటోలు, తాగునీరు సరఫరా అవుతున్న ఆవాసాల్లోని ప్రస్తుత పరిస్థితిని వివరించారు. ఈసందర్భంగా మాట్లాడిన గుజరాత్ వాస్మో ప్రాజెక్ట్ మాజీ డైరెక్టర్ ఆర్‌కె సుమా మాట్లాడుతూ ప్రజలందరికీ సురక్షిత తాగునీరు అందించడమన్నది మంచి విషయమన్నారు. 70ఏళ్ల స్వతంత్ర భారత్‌లో ఇప్పటి దారా ఇది సాధ్యం కాలేదన్నారు. 2024 నాటికి ఇంటింటికీ నల్లాతో తాగునీటిని అందిస్తామని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం అంటున్నది. కానీ ఆశ్చర్యకరమైన విషయంలో ఏంటంటే తెలంగాణ దీన్ని

మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించాలి

జాతరకు తరలి వెళ్లిన టిఆర్ఎస్ కార్యకర్తల బస్సులు
జాతరలో ప్లాస్టిక్ నిరోధానికి చర్యలు
చీఫ్‌విప్ వినయ్ భాస్కర్ వినతి

వరంగల్ అర్బన్,జనవరి21(ఆర్ఎన్ఎ): మేడారం మహా జాతరకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వాలని టీఆర్ఎస్ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. మేడారం జాతరకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ టీఆర్ఎస్ కార్యకర్తలు బస్సుల్లో వెళ్లనుండగా ,ఈ బస్సులను ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శ్రేణులమంతా మేడారం మహా జాతరకు వెళ్తున్నామన్నారు. సమ్మక్క-సారలమ్మ జాతరకు ప్రతి రెండేళ్లకొకసారి వెళ్లడం ఆనవాయితీయనీ, మేడారం మహా జాతరకు కేంద్రం జాతీయ హోదా ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. మేడారం జాతరను ఎ÷-లాస్టిక్ రహిత జాతరగా మార్చేందుకు కృషి చేయాలని ప్రజలకు సూచించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తలు ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు 10వేల క్లాత్ సంచులను పంపిణీ చేస్తారని ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్ తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు సైతం క్లాత్ సంచులను పంపిణీ చేయాలని ఆయన సూచించారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

ఫిబ్రవరి 5 నుంచి 8వ తేదీ వరకు జరిగే మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు వచ్చే భక్తుల రాకపోకలకు ఫిబ్రవరి 2 నుంచి వన్‌వే విధానం అమలు చేయనున్నట్లు ములుగు జిల్లా అడిషనల్ ఎస్పీ సాయిచైతన్య వెల్లడించారు. భక్తులు ముందస్తు మొక్కులతోపాటు జాతర సమయంలో వాహనాల రాకపోకలను నిర్దేశిరచిన మార్గాల్లో వన్‌వే ద్వారా కొనసాగిస్తామని అన్నారు. జాతరకు వచ్చే భక్తులు నిరంతరం ప్రయాణం చేయకుండా మార్గమధ్యలో విశ్రాంతి తీసుకునేందుకు మేడారం నుంచి మల్లంపల్లి వరకు 22 హాల్టింగ్ పాయింట్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ట్రాఫిక్ జామ్ వంటి సమస్యలు తలెత్తకుండా జాతరకు వచ్చే మార్గాలను జీపీఎస్‌కు అనుసంధానం చేస్తున్నట్లు వివరించారు. జాతరకు వచ్చే భక్తులు గతంలో మాదిరిగానే వన్‌వేను ఫిబ్రవరి 2 నుంచి అమలులోకి వస్తుందని ఏఎస్పీ తెలిపారు.

కరీంనగర్, ఆదిలాబాద్, మహారాష్ట్ర, గోదావరిఖని, పెద్దపల్లి, భూపాలపల్లి, మంచిర్యాల నుంచి వచ్చే వాహనాలను కాటారం ద్వారా సింగారం, కాల్వ పల్లి నుంచి మేడారం చేరుకునే విధంగా నూతన మార్గాన్ని అనుమతి స్తున్నట్లు తెలిపారు. కాటారం, కాల్వపల్లి మినహా మిగిలిన అన్ని మార్గాలు గతంలో మాదిరిగానే కొనసాగనున్నట్లు చెప్పారు. భక్తులు వన్‌వే విధానాన్ని పాటించి జాతర విజయవంతానికి సహకరించాలని కోరారు. అలాగే మేడారం జాతరలో నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ట్రాఫిక్ జామ్ ఏర్పడినా, ప్రమాదాలు జరిగినా జీపీఎస్ విధానం ద్వారా గుర్తించి కావాల్సిన క్రేన్, జేసీబీ, టోన్ వాహనం అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామని అన్నారు. ఎప్పటికప్పుడు రహదారులపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేస్తు న్నట్లు తెలిపారు. అదేవిధంగా జాతర పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను వీడియో అనలెటిక్స్ విధానం ద్వారా పర్యవేక్షించనున్నట్లు వెల్లడించారు.

జాతరకు వచ్చే అన్ని మార్గాల్లో ప్రతి 4 కిలోమీటర్లకు ఒక పోలీస్ ఔట్‌పోస్టును ఏర్పాటు చేస్తు న్నట్లు ఏఎస్పీ వెల్లడించారు. జాతర మార్గాల్లో ఏర్పడే సమస్యలను ఎప్పటికప్పుడు మొబైల్ పార్టీ ద్వారా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందిస్తామని తెలిపారు. భక్తులకు అవసరమైన సేవలను అందిం చేందుకు వివిధ రకాల వాహనాలను ఏర్పాటు చేసిన ప్రదేశాలను తెలియజేసేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

అసెంబ్లీలో టిడిపి సభ్యుల ఆందోళన

సభ నడపలేనంటూ ఆగ్రహంతో వెళ్లిపోయిన స్పీకర్
ఎస్సీ,ఎస్టీ బిల్లుపై నిరసన...వాకౌట్
మండలిలో మూడు రాజధానుల బిల్లును అడ్డుకున్న టిడిపి

అమరావతి,జనవరి21(ఆర్ఎన్ఎ): ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ సభ్యుల తీరుతో శాసన సభాపతి తమ్మినేని సీతారాం తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. టీడీపీ సభ్యుల వైఖరికి విసిగిపోయి.. సభను నడపలేనంటూ సీటునుంచి లేచి వెళ్లిపోయారు. అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో భాగంగా అభివృద్ధి, పరిపాలన వికేంద్రీకరణ బిల్లుకు ఆంధ్రప్రదేశ్ శాసన సభ సోమవారం ఆమోదం తెలిపిన విషయం విదితమే. ఈ క్రమంలో మంగళవారం సైతం ప్రత్యేక సమావేశాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ ఎస్సీ కమిషన్ ఏర్పాటు బిల్లును సభ ముందుకు తీసుకువచ్చారు. ఈ క్రమంలో బిల్లుపై చర్చ సందర్భంగా అధికార పార్టీ సభ్యులు మాట్లాడుతున్న సమయంలో టీడీపీ సభ్యులు పదే పదే అడ్డుతగిలారు. సేవ్ అమరావతి అంటూ నినాదాలు చేయడంతో పాటు.. అనుచిత వ్యాఖ్యలు చేస్తూ స్పీకర్ స్థానాన్ని అగౌరవ పరిచారు. దీంతో వారికి సర్దిచెప్పేందు స్పీకర్ ప్రయత్నించినప్పటికీ వారు మాత్రం వెనక్కి తగ్గలేదు. ఈ క్రమంలో టీడీపీ సభ్యుల తీరుతో విసిగెత్తిపోయిన తమ్మినేని సీతారాం.. ప్లీజ్... ఐ యామ్ సారీ.. ఐ యామ్ ప్రొటెస్టింగ్ ది ఆటిట్యూట్ ఆఫ్ టీడీపీ ఎమ్మెల్యేస్.. నిజంగా మనస్తాపానికి గురవుతున్నా అంటూ సభ నుంచి వెళ్లిపోయారు. ఇకపోతే అసెంబ్లీ నుంచి టీడీపీ సభ్యులు వాకౌట్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ నిధులు మళ్లించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ టీడీపీ సభ్యులు అసెంబ్లీ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఎస్సీ వర్గీకరణ ప్రకారం కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌ను పట్టించుకోకపోవడంతో సభ నుంచి టీడీపీ వాకౌట్ చేసింది. అనంతరం లాబీలో టీడీపీ సభ్యులు నినాదాలు చేశారు.

మండలిలో బిల్లుకు టిడిపి అడ్డు

ఇదిలావుంటే ఎపి శాసనమండలిలో మూడు రాజధానుల బిల్లును తెలుగుదేశం పార్టీ అడ్డుకుంది. మంగళవారం ఉదయం పాలనా వికేంద్రీకరణ బిల్లును ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శాసనమండలిలో ప్రవేశపెట్టగానే, టిడిపి ఈ బిల్లును వ్యతిరేకిస్తూ.. రూల్ నంబర్ 71 కింద నోటీసులు ఇచ్చింది. బిల్లును ప్రవేశపెట్టేముందు తామిచ్చిన నోటీసుపై చర్చించాలని టిడిపి పక్ష నేత యనమల రామకృష్ణుడు డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ఆమోదం పొందడంతో వికేంద్రీకరణ బిల్లుపై చర్చ జరపాల్సిందేనని, రూల్ 71 పేరు చెప్పి, బిల్లును తిరస్కరించే అధికారం మండలికి లేదని బుగ్గన స్పష్టం చేశారు. దీనిపై నిబంధనలను పరిశీలించిన మండలి చైర్మన్, రూల్ 71 ను పరిగణనలోకి తీసుకుని టిడిపికి అనుకూలంగా నిర్ణయం తీసుకుని, చర్చకు అనుమతిచ్చారు. దీంతో మండలిలో ఈ బిల్లుకు ప్రస్తుతానికి అడ్డుకట్ట పడినట్టే. ఒకవేళ ఇక్కడ బిల్లు వీగిపోతే, డీమ్డ్ టూ బీ పాస్డ్ కింద అధికార పక్షం, దీన్ని ఆమోదింపజేసుకునే వీలుంటుంది. ప్రస్తుతం ఎపి శాసన మండలిలో సభ్యుల సంఖ్య 58 కాగా, మూడు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో బిల్లు పాస్ కావడానికి 28 మంది సభ్యుల బలం అవసరం. టిడిపి కి 34 మంది సభ్యుల బలం ఉండటం వారికి కలిసొచ్చే అంశం. వైసిపికి మండలిలో 9 మంది పీడీఎఫ్ తరపున ఆరుగురు, బిజెపి తరపున ఇద్దరు, స్వతంత్రులు ముగ్గురు, కాంగ్రెస్ తరపున ఒక్కరు ఉండగా, మూడు స్థానాలు ఖాళీగా ఉన్నాయి.

జనగామలో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

గుర్తింపు కార్డు తప్పనిసరన్న అధికారులు

జనగామ,జనవరి21(ఆర్ఎన్ఎ): ఈ నెల 22న బుధవారం జనగామ పురపాలక సంఘం పరిధిలోని 30 వార్డులకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరుగనుంది. హైదరాబాద్ రోడ్డులోని ఏకశిల బీఈడీ కాలేజీలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏదేని గుర్తింపు కార్డుతో పాటు పోల్ చీటితో వచ్చి ఓటేయాలని అధికారులు సూచించారు. పోలింగ్ అనంతరం పోలింగ్ బాక్స్‌లను ఇక్కడికే తరలించనుండడంతో పోలీసులు బందోబస్తును ఏర్పాటుచేశారు. మున్సిపల్ ఎన్నికలకు యంత్రాంగం సన్నద్ధమైంది. మొత్తం 30 వార్డుల్లో 60 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇప్పటికే అవసరమైన సిబ్బందిని నియమించి శిక్షణను సైతం ఇచ్చింది. మొత్తం 163 మంది అభ్యర్థులు పోటీలు ఉన్నారు. 40,099 మంది ఓటర్ల తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పట్టణంలో ఎనిమిది సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించారు. ఇక్కడ ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ఎనిమిది మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. ఏకశిల బీఈడీ కాలేజీలో ఎన్నికల సిబ్బందికి సామగ్రిని పంపిణీ చేసి, కేంద్రాలకు తరలించారు. మొత్తం 40,099 మంది ఓటర్లుకుగాను పురుషులు 19,691 మంది, 20,408 మహిళలు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇప్పటికే బ్యాలెట్ పత్రాలను ముద్రించి వాటిని స్థానిక పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. ఎన్నికలను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకన్నట్లు కలెక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు. ప్రత్యేక బృంధాలతో తనిఖీలు నిర్వహిస్తుండగా.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.ఒక్కో వార్డులో రెండు బాక్సుల చొప్పున 30 వార్డులకు 60 బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, అవసరమైన స్టేషనరీ, ఎన్నికల సామగ్రి అందచేశారు. జనగామ మున్సిపల్ ఎన్నికల్లో 30 వార్డుల నుంచి మొత్తం 163 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

-ఓటర్లకు కలెక్టర్ సూచన

మహబూబాబాద్,జనవరి21 (ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల్లో ప్రతీ ఒక్క ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య అన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని, అర్హుడైన ప్రతీ ఓటరు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా వినియోగించుకోవాలన్నారు. ఓటర్ స్లిప్‌తో పాటు ఎన్నికల సంఘం ధ్రువీకరించిన 18 రకాలైన ఎపిక్ కార్డు, ఆధార్, పట్టాదార్ పాస్‌పుస్తకం, డ్రైవింగ్ లైసెన్స్ మొదలగునవి వెంట తీసుకునిరావాలన్నారు. పోలింగ్ కేంద్రంలో దివ్యాంగుల కోసం వీల్‌చైర్స్, ర్యాంపులు, మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. ఇదిలావుంటే ఈ నెల 25వ తేదీన నిర్వహించే పురపాలక సంఘం ఎన్నికల కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసామని కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య తెలిపారు. జిల్లాలోని తొర్రూరు, మరిపెడ, డోర్నకల్, మహబూబాబాద్ మున్సిపాలిటీల ఓట్ల కౌంటింగ్‌కు ఆయా మున్సిపాలిటీల పరిధిలో కౌంటింగ్ పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. మున్సిపాలిటిలోని 35 వార్డులకు సంబంధించిన ఓట్ల కౌంటింగ్ ఒకేసారి ప్రారంభించనున్నట్లు తెలిపారు. 35 వార్డులకు 12 కేంద్రాల్లో కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు

భావి తరాలకు భరోసా.. గ్రీన్ ఇండియా చాలెంజ్

హైదరాబాద్, జనవరి 21: రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా చాలెంజ్ భావి తరాలకు భరోసాగా నిలుస్తుందని ఏఎంఆర్ కంపెనీ జనరల్ మేనేజర్ తాడిచెర్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ స్వీకరించిన ఆయన మంగళవారం మూడు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రీన్ ఇండియా చాలెంజ్ అనేది గొప్ప కార్యక్రమం. ఎవరికీ, ఎలాంటి స్వార్థం లేని ఈ కార్యక్రమం.. పర్యావరణాన్ని కాపాడుతోంది. భవిష్యత్తుకు భరోసానిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొని, మొక్కలు నాటిన ప్రతి ఒక్కరికీ ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెన్కో, ఏఎంఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్ ఇండియా చాలెంజ్ లో భాగంగా ఆయన మరో ముగ్గురికి సవాలు విసిరి మొక్కలు నాటమని సూచించారు. వారిలో సిద్దయ్య కెటిపిపి సీఈ, ఎమ్మార్వో శ్రీనివాస్ తాడిచెర్ల, ఎస్సై నరేష్ కొయ్యూర్ ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన ఈ కార్యక్రమం భావితరాలకు చాలా ఉపయోగకరమైనదన్నారు. సంతోష్ కుమార్ పేరుతో త్వరలో నర్సరీ ప్రారంభిస్తామని ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

కొండగట్టుకు పెరిగిన భక్తుల రద్దీ

జగిత్యాల,జనవరి21(ఆర్ఎన్ఎ): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టులో భక్తుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో అంజన్న ఆలయం కిటకిటలాడుతుంది. క్యూలైన్లు నిండి ఆలయం వెలుపల సైతం భక్తులు బారులు తీరారు. మేడారం జాతర సందర్భంగా ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులు మేడారం వెళ్లే ముందు అంజన్నను దర్శించుకుని ఆలయంలో పూజలు చేస్తున్నారు. మంగళవారం కావడంతో కూడా భక్తుల రద్దీ పెరిగిందని అధికారులు తెలిపారు.

జొమాటోలో విలీనమైన ఊబర్ ఈట్స్

బెంగళూరు,జనవరి21(ఆర్ఎన్ఎ): ప్రముఖ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో భారత్‌లో తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరిస్తోంది. దీనిలో భాగంగానే 'ఉబర్ ఈట్స్' పేరుతో భారత్‌లో ఆహారాన్ని డెలివరీ చేస్తోన్న అమెరికాకు చెందిన క్యాబ్ సేవల సంస్థ ఉబర్‌కు చెందిన వ్యాపారాన్ని చేజిక్కించుకుంది. జొమాటో, ఉబర్ ఈట్స్ 2,485 కోట్ల విలువైన వ్యాపార ఒప్పందం చేసుకున్నాయి. ఒప్పందం మేరకు జొమాటోలో ఉబర్ ఈట్స్ విలీనమైంది. ఈ మేరకు జోమాటోలో ఉబర్‌కు 10 శాతం వాటాను ఇవ్వనున్నారు. ఉబర్ ఈట్స్ 2017లో ఫుడ్‌డెలివరీ వ్యాపారాన్ని ప్రారంభించింది. భారత్‌లో అగ్రశ్రేణి ఫుడ్‌డెలివరీ సంస్థలు జొమాటో, స్విగ్గీల నుంచి తీవ్రమైన పోటీ ఉండటంతో నిలదొక్కుకోవడంలో విఫలమైంది. అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఉబర్.. అంతర్జాతీయంగా తమ సంస్థకు నష్టాలను తెస్తున్న వ్యాపార విభాగాలను తగ్గించుకోవడంలో భాగంగానే తమ వ్యాపారాన్ని విక్రయించినట్లు ఉబర్ తెలిపింది. జొమాటో కంపెనీలో ఉబర్ విలీనం కావడంతో ఇక నుంచి ఉబర్ ఈట్స్ సేవలన్నీ భారత్‌లో నిలిచిపోతాయి. వినియోగదారులు ఉబర్ ఈట్స్ యాప్‌లో ఫుడ్ ఆర్డర్ చేసినప్పటికీ.. ఆటోమేటిక్‌గా ఆర్డర్లు అన్నీ జొమాటో ఎ÷-లాట్‌ఫామ్‌కు అనుసంధానం చేయబడి జొమాటోకు చెందిన డెలివరీ ఉద్యోగులు ఫుడ్‌ను సరఫరా చేస్తారు. ఈ ఒప్పందంతో మార్కెట్లో మా స్థాన ం మరింత బలోపేతం అయిందని, వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని జొమాటో సీఈవో దీపిందర్ గోయల్ అన్నారు.

ఒడిషాలో లారీ బీభత్సం: నలుగురు మృతి

భువనేశ్వర్ ,జనవరి21(ఆర్ఎన్ఎ): ఒడిశాలోని నంబల్‌పూర్ జిల్లా పారమానుపూర్ వద్ద లారీ బీభత్సం సృష్టించింది. అదుపుతప్పిన లారీ రోడ్డుపక్కనున్న నాలుగు దుకాణాల్లోకి దూసుకెళ్లింది. ఈ దుర్ఘటనలో నలుగురు వ్యక్తులు మృతిచెందారు. మరో ఏడుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటన తెలిసిన వెంటనే అక్కడికి చేరుకున పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు.

విఠల్ మృతి..కెఆర్ మూర్తి సంతాపం

విజయవాడ,జనవరి21(ఆర్ఎన్ఎ): ప్రముఖ కాలమిస్ట్, కమ్యూనిస్ట్ నేత డాక్టర్ ఎపి విఠల్ పార్థివదేహానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు రామచంద్రమూర్తి మంగళవారం నివాళులర్పించారు. అనంతరం విఠల్ కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కొద్ది రోజులుగా షుగర్, హృద్రోగంతో బాధపడుతున్న సిపిఎం మాజీ నేత ఎపి విఠల్ సోమవారం తుదిశ్వాస విడిచారు. ఈ సందర్భంగా రామచంద్ర మూర్తి మాట్లాడుతూ.. ' విఠల్ గొప్ప మేధావి. కమ్యూనిస్టు నాయకులలో అగ్రజుడు అయిన పుచ్చలపల్లి సుందరయ్యకి ప్రియమైన శిష్యుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ద్యమకాలంలో ముందుండి అనేక వ్యాసాలు రాశారు.

తోమర్ విద్యాభ్యాసంపై పిటిషన్

-తప్పుడు సమాచారం ఇచ్చారని కేసు

న్యూఢిల్లీ,జనవరి21(ఆర్ఎన్ఎ): ఫిబ్రవరి 8న జరిగే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమరంలో ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. 2015 అసెంబ్లీ ఎన్నికల్లో త్రినగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై, న్యాయశాఖ మంత్రిగా భాధ్యతలు స్వీకరించిన జితేంద్ర సింగ్ తోమర్.. తన ఎన్నికల అఫిడవిట్‌లో విద్యాభ్యాసానికి సంబంధించి, తప్పుడు సమాచారం ఇచ్చారని బీజేపీ హైకోర్టులో పిటిషన్ వేసింది.

దీంతో, ఆయన తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. కాగా, ఈ సారి ఢిల్లీ అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లోనూ త్రినగర్ ఆప్ అభ్యర్థిగా జితేంద్రకు టికెట్ కేటాయించారు. దీంతో, బీజేపీ నాయకులు ఎన్నికల కమిషన్‌ను కలిసి నామినేషన్‌లో తప్పుడు సమాచారమిచ్చిన ఫ్రాడ్ వ్యక్తికి ఎలా టికెట్ ఇస్తారని అన్నారు. దీంతో, ఎన్నికల కమిషన్ అతడి అభ్యర్థిత్వానికి సంబంధించి హైకోర్టులో పిటిషన్ వేసింది. పూర్వాపరాలు పరిశీలించిన కోర్టు అతడి అభ్యర్థిత్వాన్ని తిరస్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో, ఎటూ పాలుపోని జితేంద్ర సింగ్ తోమర్ తన భార్య ప్రీతి తోమర్‌ను త్రినగర్ ఆప్ అభ్యర్థిగా ప్రకటించాలని హై కమాండ్‌ను కోరాడు. హైకమాండ్ ఆయన విన్నపానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో, ప్రీతి తోమర్ సోమవారం తన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందజేసింది. కాగా, ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 8న ఒకేరోజు ఎన్నికలు జరగనుండగా, అదే నెల 11న ఈసీ ఫలితాలు వెల్లడిస్తుంది. గత 2015 అసెంబ్లీ ఎన్నికల్లో 70 అసెంబ్లీలకు గానూ ఆమ్ ఆద్మీ పార్టీ 67 స్థానాలను గెలుచుకొని, ప్రత్యర్థి పార్టీలకు అడ్రస్ లేకుండా చేసింది.

సూరత్‌లో భారీ అగ్నిప్రమాదం

అహ్మదాబాద్,జనవరి21(ఆర్ఎన్ఎ): గుజరాత్‌లోని సూరత్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. 40 అగ్నిమాపక యంత్రాలు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేందుకు శ్రమిస్తున్నాయి. రఘువీర్ మార్కెట్‌లోని బహుళ అంతస్తుల భవనంలో మంటలు చెలరేగాయి. అగ్నిప్రమాదానికి గల కారణం తెలియరాలేదు. ఇంతవరకు ఎటువంటి ప్రాణ నష్టం వాటిల్లలేదు. ఇటీవలే సూరత్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో సంభవించిన అగ్నిప్రమాదంలో 20 మంది విద్యార్థులు మృతిచెందిన విషయం తెలిసిందే.

స్త్రీల సమగ్ర జీవన చిత్రణాబతుకుపోరు

సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, దోపిడి తీరుతెన్నులు తెలిసి,అనంతృప్తి పేరుకు పోయి ఆగ్రహం నివురుగప్పిననిప్పులా రాజుకుంటున్నది.వ్యవసాయం దెబ్బతింటూ మనుగడ కోసం ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుంటున్న సన్న కారు రైతులు. దళిత, బహుజన కులాలు చైతన్యంతో పోరాటమార్గం పడుతున్నాయి.అసంతృప్తి,ఆగ్రహం కాలువలై ఉద్యమంలోకి పారుతున్నాయి. ఉత్తర తెలంగాణలో ఉద్యమ జ్వాలలు వ్వెత్తునఎగిసి పడుతున్నాయి.అదేసమయంలో తెలంగాణలో సింగరేణి బగ్గుగనులు,బీడీపరిశ్రమ వారికి ఆశ్రయాలుగాకనిపించాయి. దళిత, బహుజన కులాల్లో నాట్లేయడానికి ,కోతలు కోయడానికి వెళ్ళే స్త్రీలకు మంచి ఆదాయమార్గంగా ఆశలు చిగురింపచేసి చేతుల్లో పైసలు పడుతాయనే భ్రమను పెంచిందిబీడీపరిశ్రమ. దిగితే గాని లోతు తెలియదు అన్నట్టు.ఆపరిశ్రమలో కమీషన్‌ఏజెంట్లు, సేట్లు,దాదాలు ఎక్కడికక్కడకార్మికులను అందులో స్త్రీ కార్మికుల శ్రమను ఎలాదోచుకుంటున్నారో తెలిసి రాసాగింది. విప్లవోద్యమపాదులు పడిన ఉత్తర తెలంగాణలో ముఖ్యంగా కరీంనగర్ జిల్లాలో ఈ దోపిడి గురించి దోపిడిదుప్పలితాలు తెలుసుకోవడానికి ఎంతో కాలం పట్టలేదు.ఇలా లోలోపల ముసురుకుంటున్న బీడీకార్మికుల చైతన్య నిప్పుకణికలకు అద్దం పడుతుంది బి.ఎస్ .రాములు "బతుకుపోరు" నవల.

నిర్దిష్టత, ఒక విశ్వజనీన సత్యాన్ని ఆవిష్కరిస్తుందనే విషయానికి"బతుకు పోరు" నవల తార్కాణం. గ్రామీణ, బహుజన శ్రామికస్త్రీల జీవితాలను వాస్తవికంగా చిత్రిస్తు, బీడీపరిశ్రమలో పనిచేసే తెలంగాణ స్త్రీల జీవితాలను పీల్చి పిప్పిచేస్తున్న తీరును ఈ నవల చిత్రించింది. ఆ పరిశ్రమలో తాము ఎలా దోపిడికి గురవుతున్నమో,దాన్ని ఎలా ఎదుర్కోవాలనే చైతన్యాన్ని సంతరించుకొని పోరాటానికి ఉపక్రమించే స్త్రీల జనసమూహాన్ని చిత్రిక కట్టిన నవల. నవలా ప్రారంభం నుంచి చివరిదాకా పట్టు సడలకుండా సాగింది.పాత్రలకు అనవసర చైతన్యం ఆపాదించకుండ, ఏ పాత్రకూడా తన స్థాయినిదాటి ప్రవర్తించలేదు.స్త్రీ పురుష అసమానతల గురించి,దోపిడిగురించి స్త్రీలు మాట్లాడినప్పుడు,చివరగా వారు పోరాటానికి సమాయాత్తమయ్యే సమయంలో మితిమీరి ప్రవర్తించిన పాత్ర ఏదీలేదు.సహజంగా తమకు జరుగుతున్న అన్యాయాలను,తమపట్ల అమలవుతున్న అసమానతను,మానవ సంబంధాలను స్త్రీలు జీవితంలో భాగంగానే వ్యక్తీకరిస్తారు.చూడగలిగే ప్రతిభ వుంటే బిఎస్ రాములుకే కాదు,అందరికి అది అనుభవంలోకి వచ్చేది. కానీ దాన్ని చూసి పట్టుకోగలిగిన నేర్పును ఆయన ప్రదర్శించి ఒక రచనగా పాఠకుల ముందు ఆవిష్కరించగలిగారు. ఆ రకంగా కళాత్మక సౌందర్యం ఈ రచనకు కలిగింది.దీన్ని సాధించడంలో రచయిత పడిన శ్రమ, ప్రదర్శించిన నైపుణ్యం ఈ నవలను అసలు సిసలైన సృజనాత్మక రచనగానిలబెట్టింది.

చిన్న ఇంట్లో 'గ్యాసునూనే గుడ్డి దీపం వెలుగుతోంది'. అని చెప్పడంతో ఆగకుండా 'బీడీకొరుకులాగ వెలుగేమి యివ్వడం లేదు' అని అంటారు.'అలాగే నానిగాడికి నల్లికుట్టి నట్టుంది'.అటునుండి ఇటు పొర్లాడు. కళ్లు మూసుకొని నిద్రలో పాలకై నోరుచాపి అమ్మమీద చేయి వేయబోయాడు. చేతికి అమ్మ అందలేదు. అని చెప్పడంతో సరిపెట్టకుండా 'చేయి పక్కన వున్న బీడీల చేటలోపడింది అని అంటారు రచయిత. దీని వల్ల రెండు విధాల ప్రయోజనం చేకూరింది. స్త్రీల జీవితాల్లోకి బీడీపరిశ్రమ ఎలా చొచ్చుకుని వచ్చిందో పాఠకులకు తెలియజెప్పడంతో పాటు నవల వస్తువును అనాలోచితంగా అన్యాపదేశంగా పరిచయం చేస్తున్నారు రచయిత. ఇందులోని ప్రధాన పాత్ర లక్ష్మి. ఆమెది సాత్విక పాత్ర. లోకజ్ఞానమెరిగిన స్త్రీ.రామక్క,సత్తక్క,సుగుణ ఒక్కోపాత్ర ఒక్కో విలక్షణతను సంతరించుకుంది. ఇవి మూస పాత్రలు కావు. రచయిత వాటిని తన సిద్ధాంతాన్నో,తానెరిగిన జ్ఞానాన్నో పంచడానికి వాటిని రక్తమాంసాలు లేని కొయ్యబమ్మలుగా తయారు చేయలేదు.అవి సజీవ పాత్రలు. మన కళ్ళముందు కదలాడే తెలంగాణ పల్లె.

బతుకుపోరు నవల తెలంగాణ బహుజన శ్రామిక స్త్రీలు తమ కథలను,తమ వెతలను,తమ పోరాటాలను తామే నోరు తెరిచి చెప్పకుండానే వారి మాటల ద్వారా, చేష్టల ద్వారా మనకు చెప్పుకుంటూ పోతారు.తమ ఆడబతుకులెంత కనాకష్టమైనవో,తాము అదనంగా అనుభవిస్తున్న పునరుత్పత్తి కష్టమేమిటో, తాము ఎలా వివక్షకు గురవుతున్నామో గ్రామీణ బహుజన శ్రామిక స్త్రీలకు స్పష్టంగానే తెలుసు. ఆ పల్లెలో ఏ స్త్రీని పలకరించిన తన భాషలో,తన యాసలో ఈ విషయాన్ని చాలా స్పష్టంగా చెప్పగలదు. తన సహజమైన శైలిలోనే ఈ విషయాన్ని లక్ష్మి తన భర్త రాజయ్యతో చేసిన సంభాషణ మనకు అర్థమవుతుంది. "మేము ఆడోల్లం జేసేపనిల మీరు ఏ పాటి పని జేత్తరు? మేం ఒక్క పొరగాన్ని సగవెట్టినంత పని గాదు మీరు పొద్దంతాక రాజ్యాలేలచ